# మన జనప్రగతి

తెలుగు దినపత్రిక

నిజం మా ధర్మం | వార్త మా వంతు | అభివృద్ధి మా లక్ష్యం

సంపుటి : 6 సంచిక : 151 పేజీలు : 8 వెల : రూ.2/- శనివారం 27 జూన్ 2026 వైఎస్సార్ కడప

Circulated by Kadapa, Ananthapur, Chittor, Vishakapatanam, Srikakulam, Elluru, Thirupathi, Ongole, Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool


## పల్నాడు జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

**ఆగివున్న లారీని ఢీకొట్టిన తుపాను వాహనం**

**ప్రమాదంలో నలుగురు అక్కడికక్కడే మృతి**




2లో

## వెనిజులాలో భూకంపం.. 589కి చేరిన మరణాలు



**వెనిజులాల,మన జనప్రగతి జూన్ 26:** వెనిజులాలో భూకంపంలో మృతుల సంఖ్య 589కి పెరిగింది. గాయపడిన వారి సంఖ్య 3 వేలకు చేరింది. ఈమేరకు ఆ దేశ తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్స్ వివరాలు వెల్లడించారు. అత్యంత తీవ్రంగా దెబ్బతిన్న లా గువేరా ప్రావిన్స్‌లో సహాయక చర్యల మిగతా2లో...

ఏపీ, తెలంగాణలో మూడ్రోజుల పాటు

## భారీ వర్షాలు

**వాతావరణశాఖ భారీ రెయిన్ అలర్ట్ జారీ**

**అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు జారీ**



**హైదరాబాద్,మన జనప్రగతి జూన్ 26:** నైరుతి రుతుపవనాలు ఏపీలో విస్తరిస్తున్నాయి. దీని ప్రభావంతో రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. పలు జిల్లాల్లో భారీ మిగతా2లో...

# అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- ● సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూడాలి ● అందుకు ముందస్తు చర్యలు తీసుకోవాలి
- ● క్రమం తప్పకుండా ఫాగింగ్ నిర్వహించాలి ● ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సూచన



**అమరావతి,మన జనప్రగతి జూన్ 26:** వర్షాకాలం నేపథ్యంలో గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ అధికారుల్ని ఆదేశించారు. పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి భద్రత, దోమల నియంత్రణ చర్యలపై అధికారులతో చర్చించారు. ప్రజారోగ్య పరిరక్షణను ప్రతి గ్రామ పంచాయతీ అత్యంత ప్రాధాన్యత అంశంగా తీసుకోవాలన్నారు. క్రమం తప్పకుండా అన్ని పంచాయతీల్లోనూ బ్లీచింగ్ పౌడర్, క్లోరిన్ బిళ్లలు తగిన మోతాదులో అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. మిగతా2లో...



## 2047 నాటికి మాదకద్రవ్య రహిత భారత్ సాధనే లక్ష్యం

**- కేంద్ర హోం మంత్రి అమిత్ షా**

**అమరావతి,మన జనప్రగతి జూన్ 26:** వచ్చే 2047 నాటికి మాదక ద్రవ్య రహిత భారత్ (డ్రగ్స్ ఫ్రీ భారత్)సాధనే లక్ష్యంగా ప్రతీ ఒక్కరూ పని చేయాలని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా పిలుపు నిచ్చారు. శుక్రవారం ఆయన ఢిల్లీ

మిగతా2లో...

ప్రైవేటు పాఠశాలల్లో అధిక ఫీజులను

# నియంత్రించాలి

- ● అధిక ఫీజుల నియంత్రణకు అధ్యయనం చేయాలి
- ● విద్యాశాఖ అధికారులను ఆదేశించిన మంత్రి లోకేశ్



**అమరావతి,మన జనప్రగతి జూన్ 26:** ప్రైవేటు పాఠశాలల్లో అధిక ఫీజుల నియంత్రణకు అధ్యయనం చేయాలని మంత్రి లోకేశ్ విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. నిరుద్యోగ యువతకు ఉపయోగపడేటట్లు రూపొందించిన నైపుణ్యం పోర్టల్‌ను జులైలో ఆవిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు. ఇందులో నమోదైన ప్రతి ఒక్కరికీ ఆన్‌లైన్ స్కిల్ కార్డు జారీ చేయాలన్నారు. భవిష్యత్తులో మరిన్ని నైపుణ్య విశ్వవిద్యాలయాలు రాష్ట్రంలో ఏర్పాటు చేసేందుకు దేశంలోనే ఒక నమూనాగా నైపుణ్య వర్సిటీల చట్టం ఉండాలని సూచించారు. ఉండవల్లి నివాసంలో పాఠశాల, ఉన్నత విద్య, నైపుణ్యాభివృద్ధి - శిక్షణ శాఖలపై మంత్రి లోకేశ్ సమీక్ష నిర్వహించారు. ప్రైవేటు పాఠశాలల్లో అధిక ఫీజులు నియంత్రణకు ఇతర రాష్ట్రాలు అవలంభిస్తున్న విధానాలను మిగతా2లో...

## అమరావతిలో డ్రోన్ డెలివరీ నెట్‌వర్క్

**డ్రోన్ కార్పొరేషన్, ఎయిర్‌బౌండ్ సంస్థతో ఒప్పందం**

**కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు వెల్లడి**

**డ్రోన్ ఆవిష్కరణల రంగంలో సరికొత్త అవకాశాలు**



**న్యూఢిల్లీ,మన జనప్రగతి జూన్ 26:** ప్రస్తుతం డ్రోన్ సేవలు అత్యంత వేగంగా విస్తరిస్తున్నాయి. వ్యవసాయం, వైద్యం, ఈ-కామర్స్, డెలివరీలు, శాంతిభద్రత పరిరక్షణలో వీటిని విస్తృతంగా వాడుతున్నారు. తాజాగా రాజధాని అమరావతిలో డ్రోన్ డెలివరీ నెట్‌వర్క్‌ను అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. రాజధాని ప్రాంతమైన అమరావతి అంతటా డ్రోన్ డెలివరీ నెట్‌వర్క్‌ను అభివృద్ధి చేసున్నారు. ఈ నేపథ్యంలో ఏపీ డ్రోన్ కార్పొరేషన్, ఎయిర్‌బౌండ్ సంస్థతో అవగాహన ఒప్పందం చేసుకుంది. గురువారం మిగతా2లో...




## యువశక్తే దేశానికి పెట్టుబడి


**గంజాయి, మాదకద్రవ్యాల నిర్మూలనే లక్ష్యం**

**డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ నిర్మాణమే లక్ష్యం: హోం మంత్రి వంగలపూడి అనిత**

**అమరావతి,మన జనప్రగతి జూన్ 26:** దేశంలో అత్యంత శక్తివంతమైన మానవ వనరులైన యువశక్తి భగ్నం కాకుండా, రాబోయే తరాల అభివృద్ధికి వారిని ఒక పెట్టుబడిగా ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత అందరిపై ఉందని రాష్ట్ర హోం, విపత్తు నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత పేర్కొన్నారు. మినిస్ట్రీ ఆఫ్ సోషల్ జస్టిస్ అండ్ ఎంపవర్మెంట్, గవర్నమెంట్ ఆఫ్ ఇండియా, డిపార్ట్మెంట్ ఫర్ వెల్ఫేర్ ఆఫ్ డిఫెరెంట్లీ ఏబుల్డ్, ట్రాన్స్జెండర్ అండ్

మిగతా2లో...

## తిరుపతికి 2 బుల్లెట్ ట్రైన్స్!!



**హైదరాబాద్-చెన్నైమార్గం గుండా తిరుపతి**

**ప్రత్యేక బుల్లెట్ రైలు లింక్ కారిడార్ ప్రతిపాదన**

**ప్రతిపాదనకు లభించిన ప్రాథమిక అంగీకారం**

**త్వరలోనే కార్యరూపం దాల్చనున్న ప్రాజెక్టు**

**తిరుపతి,మన జనప్రగతి జూన్ 26:** దేశంలోని అత్యంత ప్రతిష్ఠాత్మకమైన హైస్పీడ్ బుల్లెట్ రైలు ప్రాజెక్టుల మ్యాప్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కీలక కేంద్రంగా మారనుంది. హైదరాబాద్-అమరావతి-చెన్నై హైస్పీడ్ కారిడార్‌ను రాజధాని అమరావతి మీదుగా నిర్మించాలనే రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనకు నేషనల్ హైస్పీడ్ రైల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎన్హెచ్ఎస్ఆర్సీఎల్) సానుకూలంగా మిగతా2లో...

## పొగాకు గిట్టుబాటు ధరకు ప్రభుత్వం గట్టి భరోసా

- మార్కెట్ పరిస్థితులపై నిరంతర నిఘా పెట్టాలి
- పొగాకు రైతుల సమస్యలు, ఎరువుల పంపిణీపై జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి
- జిల్లా కలెక్టర్లు, వ్యవసాయ శాఖ అధికారులతో మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు టెలీ కాన్ఫరెన్స్



**అమరావతి,మన జనప్రగతి జూన్ 26:** వర్జీనియా పొగాకు రైతులకు ఎలాంటి నష్టం జరగకుండా కొనుగోలు ప్రక్రియను జిల్లా యంత్రాంగం నిరంతరం పర్యవేక్షించాలని, ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు సరాసరి ధర కిలోకు రూ.200 కంటే తక్కువ ధరకు కొనుగోళ్లు జరిగేందుకు ఎట్టి పరిస్థితుల్లోనూ అవకాశం ఇవ్వొద్దని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. వ్యవసాయ శాఖ డైరెక్టర్ జిలాని, వర్జీనియా పొగాకు సాగు జరిగే జిల్లాల కలెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులతో శుక్రవారం మంత్రి టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి పొగాకు కొనుగోళ్లు, రైతులు ఎదుర్కొంటున్న పరిస్థితులు, ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన ఎరువుల లభ్యత, పంపిణీ ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. పొగాకు కొనుగోలు కేంద్రాల్లో మిగతా2లో...

పాటిల్‌తో సీఎం ఏం మాట్లాడారో

## ప్రజలకు చెప్పాలి

**- భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు**

**హైదరాబాద్,మన జనప్రగతి జూన్ 26:** భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ ప్రస్తావించిన ప్రాజెక్టులపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. శుక్రవారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ తుంగభద్ర అంశంపై ప్రభుత్వం పూర్తి వివరాలు వెల్లడించాలని అన్నారు. తెలంగాణకు ఆ రెండు ప్రాజెక్టుల నుంచి 15.9 టీఎంసీల నీటి వాటా రావాల్సి ఉండగా, కేవలం 5 టీఎంసీలే చూపిస్తున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు రాష్ట్ర ప్రజలను మోసం చేశాయని విమర్శించారు. కేసీఆర్ తెలంగాణకు రావాల్సిన వాటా కంటే



తక్కువకు అంగీకరించారని పేర్కొన్నారు. అలాగే ఎస్ఐఆర్‌పై ఓవైసీ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ, భాజపా ఐడీ కార్డు మాత్రమే కాదు, పాస్‌పోర్ట్ వంటి గుర్తింపు పత్రాల చెల్లుబాటుపై ఆయన చేసిన వ్యాఖ్యలను తప్పుబట్టారు.

మన జనప్రగతి
తెలుగు దినపత్రిక
నిజం మా ధర్మం | వార్త మా వంతు | అభివృద్ధి మా లక్ష్యం
27 - 06 - 2026

## ఏపీ, తెలంగాణలో మూడ్రోజుల పాటు భారీ వర్షాలు

(మొదటి పేజీ తరువాయి)

వానలు పడగా.. అమరావతి వాతావరణ కేంద్రం భారీ వర్షసూచన జారీ చేసింది. జూన్ 26వ తేదీన అనకాపల్లి, కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, పోలవరం, పశ్చిమగోదావరి, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం జిల్లాల్లో వర్షాలు కురుస్తాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది. ఇక మిగతా జిల్లాల్లో కూడా పిడుగులతో కూడిన వానలు కురిసే అవకాశముందని, పొలాల్లో ఉండే కూలీలు, రైతులు, పుశువుల కాపరులు జాగ్రత్తగా ఉండాలని సూచించింది. వర్షాలు పడే సమయంలో సురక్షిత ప్రాంతాల్లో తలదాచుకోవాలని పేర్కొంది. ఈదురుగాలులు గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో వీచే అవకాశముందని వాతావరణ శాఖ తెలిపింది. నేడు ఉత్తరాంధ్ర, కోస్తాంధ్ర జిల్లాల్లో మోస్తరు వర్షాలు పడతాయని తెలిపింది. గడిచిన 24 గంటల్లో పార్వతీపురం మన్యం జిల్లా గరుగుబిల్లిలో 5.2 సెంటీమీటర్ల అత్యధిక వర్షపాతం నమోదవ్వగా.. కృష్ణా జిల్లా గుడివాడలో 3.5 సె.మీ, పార్వతీపురం మన్యం జిల్లా పార్వతీపురంలో 3.5 సె.మీ, పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురంలో 3.3 సె.మీ, ఏలూరు జిల్లా భీమడోలులో 3 సె.మీల వర్షపాతం నమోదైనట్లు వెల్లడించింది. ఇక ఏలూరు జిల్లా కైకలూరులో 2.9 సెంటీమీటర్లు, విజయనగరంలో 2.7 సె.మీ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కొనసీమ జిల్లా అమలాపురంలో 2.6 సె.మీ, ఎన్టీఆర్ జిల్లా పాలేరు బ్రిడ్జి 2.4 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఇక రాయలసీమలో రాబోయే మూడ్రోజుల పాటు భారీ వర్షాలు కురవనున్నట్లు వాతావరణశాఖ వెల్లడించింది. ఈదురుగాలులు 40–50 కిలోమీటర్ల వేగంతో వీస్తాయిని తెలిపింది. ఇక కొన్ని ప్రాంతాల్లో వర్షాలు కురవనుండగా.. మరికొన్ని ప్రాంతాల్లో ఎండ తీవ్రత కొనసాగనుంది. ఏపీపై కూడా ఎల్‌నినో ప్రభావం ఉంటుందని, పంటల సాగు విషయంలో ప్రత్యామ్నాయలను ఎంచుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. అటు తెలంగాణలో రాబోయే మూడ్రోజుల పాటు భారీ వర్షాలకు ఛాన్స్ ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం స్పష్టం చేసింది. జూన్ 26,278వ తేదీల్లో మంచిర్యాల, జగిత్యాల, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములు గు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో భారీ వర్షాలు పడతాయని అంచనా వేసింది. ఇక జూన్ 27,28వ తేదీల్లో ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, గద్వాలల్లో భారీ వానలు కురు స్తాయని తటిపింది. జూన్ 28,29వ తేదీల విష యానికొస్తే.. ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశముందని హెచ్చరిం చింది. పలు జిల్లాలకు పిడుగుపాటు హెచ్చరిక జారీ చేసింది.

## 2047 నాటికి మాదకద్రవ్య రహిత భారత్ సాధనే లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

నుండి వివిధ రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు,పోలీసు ఉన్నతాధికారులు,నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో తదితర విభాగాల అధికారులతో నార్కో కోఆర్డినేషన్ పై వీడియో సమావేశం నిర్వహించారు. కేంద్ర మంత్రి అమిత్ షా మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడి పిలుపు మేరకు 2047 నాటికి డ్రగ్స్ రహిత భారత్ సాధనే లక్ష్యంగా పని చేయాలని ఇందుకు సాంకేతికత సాయంతో పటిష్టమైన నిఘా వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని రాష్ట్రాలకు సూచించారు. ముఖ్యంగా మాదక ద్రవ్యాలు సరఫరా, విక్రయం చేసే వారిపై కఠినంగా మరియు జీరో టోలరెన్స్‌గా వ్యవహరించాలని స్పష్టం చేశారు. ఇందుకు సంబంధించిన హాట్ స్పాట్లను గుర్తించి కట్టుదిట్టమైన నిఘా ఉంచి కింగ్ పిన్ లను పెట్టుకోవడంతో పాటు వారికి సకాలంలో శిక్షపడేలా చూడాలన్నారు.ప్రత్యేక రోడ్డు మ్యాప్ ను రూపొందించుకోవడంతో పాటు కమ్యునిటీ పోలీసింగ్ ను మరింత పెంపొందించుకోవాలని కేంద్ర హోం మంత్రి అమిత్ షా రాష్ట్రాలకు స్పష్టం చేశారు.అదే విధంగా మాదక ద్రవ్యాల సేవనం, సరఫరా, విక్రయాల వల్ల కలిగే అనర్థాలు గురించి ప్రజల్లో విస్తృత అవగాహన కలిగించాలని చెప్పారు.విజయవాడ సిఎస్ క్యాంపు కార్యాలయం నుండి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి.సాయి ప్రసాద్ వీడియో సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ ఎపిలో పోలీసు విభాగం ప్రత్యేక రాష్ట్ర స్థాయి మాదకద్రవ్య వ్యతిరేక దళం సమర్ధవంతంగా పనిచేస్తోందని చెప్పారు.ఒకప్పుడు ఆంధ్ర–ఒడిశా సరిహద్దు గంజాయి ప్రాంతంగా పేరుపొందిన ఆంధ్రప్రదేశ్ నేడు మాదకద్రవ్యాల నియంత్రణ అమలులో జాతీయ స్థాయిలో ఒక ఆదర్శప్రాయమైన ప్రమాణంగా నిలిచిందని అన్నారు. రైల్వే నెట్‌వర్క్ ద్వారా రాష్ట్రాల మధ్య జరిగే మాదకద్రవ్యాల రవాణాను అడ్డుకోవడానికి ప్రతి జిల్లాలో వారానికి మూడుసార్లు స్థానిక పోలీసులు,జీఆర్పీ, ఆర్పీఎఫ్,ఈగిల్ మరియు శునక దళాలను సంయుక్తంగా మోహరించి పెద్ద ఎత్తున తనిఖీలు నిర్వహించడం జరుగుతుందని వివరించారు.ఈగల్ మంగళగిరిలోని ప్రధాన కార్యాలయంలో ఒక ప్రత్యేకమైన, సురక్షితమైన డేటా సెంటర్ ను నిర్వహించడంతో పాటు రాష్ట్ర మాదకద్రవ్యాల నిరోధక వ్యవస్థకు కేంద్రీకృత నిఘా కేంద్రంగా పని చేస్తోందని తెలిపారు.ఈవీడియో సమావేశంలో ఈగల్ చీఫ్ ఐజిపి ఆకె రవికృష్ణ,ఈగల్ ఎస్పి ఆపరేషన్స్ కెయం. మహేశ్వర రాజు, విశాఖపట్నం ఎన్సిబి ఎస్పి జెడి పంకజ్,ఎన్సిబి డిఎస్పి కిరణ్ పాల్గొన్నారు.

## ప్రైవేటు పాఠశాలల్లో అధిక ఫీజులను నియంత్రించాలి

(మొదటి పేజీ తరువాయి)

అధ్యయనం చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు, అభ్యసన ఫలితాలపై దృష్టి సారించాలన్నారు. అమరావతిలో రాష్ట్ర కేంద్రీయ గ్రంథాలయంతో పాటు విశాఖలో జిల్లా కేంద్రీయ గ్రంథాలయం, మంగళగిరిలో స్కిల్ ఎక్సలెన్స్ సెంటర్ ఏర్పాటుపైనా సమావేశంలో చర్చించారు. ఇందుకు సంబంధించిన భవన నమూనాలను మంత్రి పరిశీలించారు. వచ్చే నెలలో అమరావతిలో రాష్ట్ర కేంద్రీయ గ్రంథాలయం నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్నామని లోకేశ్ తెలిపారు.విశ్వవిద్యాలయాల అధ్యాపక పోస్టుల భర్తీ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని ఆదేశించారు. వర్సిటీల్లో 1,523 అధ్యాపక పోస్టులకు లక్షా 89 వేల 316 దరఖాస్తులు వచ్చాయని అధికారులు వివరించారు. ప్రతి దరఖాస్తు డేటాను పరిశీలించాలని స్పష్టం చేశారు. వర్సిటీ యూనిట్‌గా నియామకాలు చేపడుతున్నందున సెలక్షన్ కమిటీల ఎంపికకు స్పష్టమైన మార్గదర్శకాలు ఇవ్వాలని తెలిపారు. పీఎం సేతు పథకం కింద రాష్ట్రానికి ఐదు క్లస్టర్లు మంజూరయ్యాయని వెల్లడించారు. ఇందులో ఉక్కు, నౌకల నిర్మాణం, పెట్రోకెమికల్ క్లస్టర్ ఏర్పాటుకు అర్సెలర్ మిట్టల్ సంస్థ ముందుకు వచ్చిందన్నారు.పునరుత్పాదక ఇంధనం, ఫార్మా, ఆక్వా, శ్రీసిటీ క్లస్టర్లలో పీఎం సేతు పథకం కింద ఐటీఐలను బలోపేతం చేయాలని సూచించారు. ఐటీఐలలో ఏఐ ల్యాబ్‌లు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఆరోగ్య సంరక్షణ కోర్సులు పూర్తి చేసిన వారికి ఓంక్యాప్ ద్వారా జపాన్‌లో ఉద్యోగాలు కల్పించడంపై దృష్టి సారించాలని తెలిపారు. ఓంక్యాప్ ద్వారా 146మందికి విదేశీ ఉద్యోగాలు కల్పించామని చెప్పారు. ప్రతి 3 నెలలకోసారి నియోజకవర్గాల్లో ఉద్యోగ మేళాలు నిర్వహించాలని మంత్రి ఆదేశించారు. ఉద్యోగ మేళాలతో ఇప్పటి వరకు లక్ష 30వేల మందికి ఉద్యోగులు కల్పించినట్లు అధికారులు చెప్పారు. ఉద్యోగ మేళాలను రాష్ట్ర స్థాయి కమాండ్ కంట్రోల్ నుంచి పర్యవేక్షిస్తున్నట్లు వివరించారు. ప్రైవేటు నుంచి ప్రభుత్వ పాఠశాలలకు ఈ ఏడాది 1.06లక్షల మంది విద్యార్థులు వచ్చారని మంత్రి లోకేశ్‌కు అధికారులు తెలిపారు. రాష్ట్రంలో 7 వేల 620 ప్రాథమికోన్నత బడులు ఉండగా 3వేల 515 పాఠశాలల్లో గరిష్ఠ సామర్థ్యం మేర విద్యార్థులు ప్రవేశాలు పొందారని చెప్పారు. విద్యా రంగంలో తీసుకొచ్చిన సంస్కరణల ఫలితంగానే విద్యార్థుల ప్రవేశాలు పెరిగాయని, ఈ ఏడాది 159 పాఠశాలలు ఆదర్శ ప్రాథమిక పాఠశాలలుగా మారాయని తెలిపా రు. సెప్టెంబరు 5 నుంచి 175 లీప్ పాఠశాలల్లో 9,10 తరగతుల విద్యార్థులకు గణితం, సామాన్య శాస్త్రం సబ్జెక్టులకు సంబంధించి ఏఐ ట్యూటర్ విధానాన్ని ప్రీ పైలట్ ప్రాజెక్టుగా చేపట్టనున్నట్లు వెల్లడించారు.

## తిరుపతికి 2 బుల్లెట్ ట్రైన్స్!!

(మొదటి పేజీ తరువాయి)

స్పందించింది. అదే సమయంలో చెన్నై–బెంగళూరు కారిడార్‌లోని చిత్తూరును, హైదరాబాద్–చెన్నై మార్గంలోని తిరుపతితో అనుసంధానించే ప్రత్యేక బుల్లెట్ రైలు లింక్ కారిడార్ ప్రతిపాదనకు సైతం ప్రాథమిక అంగీకారం లభించింది. ఈ కీలక నిర్ణయంతో దక్షిణ భారతదేశంలోని ప్రధాన నగరాలన్నీ ఒకే నెట్‌వర్క్‌తో అనుసంధానమయ్యే అద్భుత అవకాశం ఏర్పడింది. హైదరాబాద్–అమరావతి–చెన్నై హైస్పీడ్ కారిడార్ మొత్తం 760.09 కిలోమీటర్ల మేర మూడు రాష్ట్రాల మీదుగా విస్తరించనుంది. ఇందులో తెలంగాణలో 180.32 కిలోమీటర్లు ఉండగా, ఆంధ్రప్రదేశ్‌లో అత్యధికంగా 518.54 కిలోమీటర్ల మేర మార్గం ఉండనుంది. తమిళనాడులో 61.23 కిలోమీటర్ల మేర ఈ మార్గం సాగుతుంది. ఈ ప్రాజెక్టులో భాగంగా మొత్తం 18 స్టేషన్లను ప్రతిపాదించారు. తెలంగాణలో హైదరాబాద్, శంషాబాద్ సహా ఆరు స్టేషన్లు ఉండగా, ఆంధ్రప్రదేశ్‌లో అమరావతి, గుంటూరు, నెల్లూరు, తిరుపతి వంటి ప్రధాన నగరాలతో కలిపి తొమ్మిది స్టేషన్లను ఏర్పాటు చేయనున్నారు.రాష్ట్ర ప్రభుత్వ సూచనల మేరకు చిత్తూరు–తిరుపతి మధ్య సుమారు 65 కిలోమీటర్ల పొడవున ప్రత్యేక హైస్పీడ్ లింక్ కారిడార్ ఏర్పాటును ఎన్హెచ్ఎస్ఆర్సీఎల్ క్షుణ్ణంగా పరిశీలిస్తోంది. దీనికోసం తుది స్థల నిర్ధారణ సర్వే, వివరణాత్మక ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) తయారీకి సంస్థ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ నివేదిక సిద్ధమైన వెంటనే కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖకు పంపి తుది ఆమోదం తీసుకోనున్నారు. ఈ లింక్ కారిడార్ అందుబాటులోకి వస్తే, బెంగళూరు నుంచి చిత్తూరు, తిరుపతి మీదుగా అమరావతి వరకు నేరుగా బుల్లెట్ రైలులో ప్రయాణించే వెసులుబాటు కలుగుతుంది.మరోవైపు 306 కిలోమీటర్ల పొడవైన చెన్నై–బెంగళూరు హైస్పీడ్ కారిడార్‌లో చిత్తూరు ప్రధాన స్టేషన్‌గా నిలవనుంది. ఇందులో తమిళనాడులో 133 కిలోమీటర్లు, కర్ణాటకలో 101 కిలోమీటర్లు, ఆంధ్రప్రదేశ్‌లో 72 కిలోమీటర్ల మార్గం ఉండనుంది. మూడు రాష్ట్రాల్లో కలిపి మొత్తం ఏడు స్టేషన్లను ప్రతిపాదించారు. ఈ నెట్‌వర్క్ పూర్తయితే పారిశ్రామిక, వాణిజ్య, పర్యాటక రంగాలకు ఊహించని రీతిలో భారీ ఊతం లభిస్తుంది. ముఖ్యంగా తిరుమల పుణ్యక్షేత్రానికి వచ్చే లక్షలాది భక్తులకు అత్యంత వేగవంతమైన రవాణా సౌకర్యం అందుబాటులోకి రానుంది.

## యువశక్తే దేశానికి పెట్టుబడి

(మొదటి పేజీ తరువాయి)

సీనియర్ సిటిజన్స్ శాఖ, ఈగల్ సంయుక్త ఆధ్వర్యంలో నషా ముక్త్ భారత్ అభియాన్ లో భాగంగా అంతర్జాతీయ మాదకద్రవ్య దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని శుక్రవారం స్థానిక తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన హోంమంత్రి వంగలపూడి అనిత యువతకు, తల్లిదండ్రులకు కీలక సందేశాన్ని ఇచ్చారు.?డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ లక్ష్యం.... మాదకద్రవ్యాల జోలికి ఎవరూ పోకూడదనే ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ఈ యాంటీ నార్కోటిక్ క్యాంపెయిన్‌ను నిర్వహిస్తున్నాయని తెలిపారు.?నేటి తరం పిల్లలు ఎంతో ఫాస్ట్ గా, క్లారిటీగా ఉంటున్నప్పటికీ, చిన్న అవగాహన లోపం వల్ల డ్రగ్స్ బారిన పడి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 'ప్రివెన్షన్ ఈజ్ బెటర్ దెన్ క్యూర్' (నివారణే మేలు) అన్నట్లుగా, యువత వీటి జోలికి వెళ్లకుండా ముందే కాపాడుకోవడం ముఖ్యం అని చెప్పారు.?60శాతం నుండి 70 శాతం స్నేహితుల ప్రభావమే... దేశంలో దాదాపు 3.5 నుండి 4 కోట్ల మంది గంజాయి, డ్రగ్స్‌కు అలవాటు పడ్డారని, ముఖ్యంగా 13 నుండి 18 సంవత్సరాల వయస్సు వారు ఎక్కువగా దీనికి ఆకర్షితులవుతున్నారని హోం మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. కేవలం స్నేహితుల ఒత్తిడి వల్లే 60 నుంచి 70 శాతం మంది వీటికి బానిసలవుతున్నారని, ఇలాంటి అలవాట్లు చేసే స్నేహితులు శత్రువులతో సమానమని హెచ్చరించారు.తల్లిదండ్రుల ఆశలను వమ్ము చేయవద్దు...ఎన్నో కష్టాలకోర్చి, తమ స్థాయికి మించి పిల్లలను హాస్టల్స్ లో ఉంచి చదివిస్తున్న తల్లిదండ్రుల ఆశలను యువత అపహాస్యం చేయవద్దని కోరారు. ఒక్కసారి గంజాయికి బానిసైతే జైలు పాలవ్వడం ఖాయమని, ఈ మధ్య కాలంలో తల్లిదండ్రులు కూడా ఇలాంటి పిల్లలకు బెయిల్ ఇప్పించడానికి ముందుకు రావడం లేదని గుర్తుచేశారు.?'ఈగిల్' టాస్క్ ఫోర్స్ ఘనత... గంజాయి రవాణా, సాగును అరికట్టడానికి 450 మంది సిబ్బందితో పనిచేస్తున్న 'ఈగిల్' టాస్క్ ఫోర్స్ అద్భుతమైన ఫలితాలు సాధించిందని కొనియాడారు. గత గత ప్రభుత్వ కాలంలో ఏజెన్సీ పరిధిలో దాదాపు 20 వేల ఎకరాల్లో గంజాయి సాగు జరిగేదని దానిని ధ్వంసం చేశామని, ప్రస్తుతం అక్కడ గంజాయి సాగును పూర్తిగా నిర్మూలించి 'జీరో కల్టివేషన్' సాధించామని స్పష్టం చేశారు. లిక్విడ్ గంజాయి (హాష్ ఆయిల్) తయారీ కేంద్రాలపై కూడా కఠిన చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.?కఠినమైన ఎన్‌డిపిఎస్ చట్టం....గంజాయి లేదా డ్రగ్స్ రవాణా చేసినా, దగ్గర పెట్టుకున్నా, కన్స్యూమ్ చేసినా ఎన్ డి పి ఎస్ చట్టం ప్రకారం కఠినమైన చర్యలు ఉంటాయన్నారు.

## పల్నాడు జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

**పల్నాడు, మన జనప్రగతి జూన్ 26:**పల్నాడు జిల్లాలో.. ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది.. నలుగురు మృతి చెందారు. జిల్లాలోని.. మాచర్ల నగరవనం దగ్గర ఆగివున్న లారీని తుపాను వాహనం ఢీకొట్టింది. దీంతో వాహనంలోని నలుగురు అక్కడికక్కడే చనిపోయారు. మరికొందరు గాయాలపాలయ్యారు. వారిని స్థానికులు ఆస్పత్రికి తరలించారు. మృతులంతా హైదరాబాద్ వాసులుగా తెలిసింది. బంధువులు మృతి చెందడంతో తుపాను వాహనంలో పామూరు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటన స్థానికంగా తీవ్ర విషాదం కలిగించింది. విషయం తెలుసుకున్న స్థానికులు.. అయ్యో అంటున్నారు. చనిపోయిన వారి బంధువులను ఓదార్చేందుకు వెళ్తూ.. చనిపోవడం అనేది వారిని కలచివేసింది. తుపాను వాహనం అతివేగంతో రావడం వల్ల ఈ ప్రమాదం జరిగివుంటుందని ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. ఐతే.. మన ఏపీ, తెలంగాణలో రోడ్లపై తరచూ ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. కొన్ని చోట్ల స్ట్రీట్ లైట్లు ఉండట్లేదు. మరికొన్ని చోట్ల రోడ్లపై గతుకులు బాగా ఉంటున్నాయి. అతివేగం చాలా ప్రాణాలు తీస్తోంది. వాహనం వేగంగా వెళ్లేదైనా.. నెమ్మదిగా వెళ్లడం మేలు. ఇలాంటి ప్రమాదాల్లో చాలా ప్రాణాలు కోల్పోతుంటే.. వారి కుటుంబ సభ్యులు అనేక రకాలుగా కష్టాల్లో పడుతున్నారు.

## వెనిజులాలో భూకంపం.. 589కి చేరిన మరణాలు

(మొదటి పేజీ తరువాయి)

కోసం సైనికులను మోహరిస్తున్నట్లు తెలిపారు. మరోవైపు వందలాది మంది శిథిలాల కింద చిక్కుకుపోయారని ప్రభుత్వం అంచనా వేసింది. గల్లంతైన వారి వివరాలను స్వీకరించేందుకు ఏర్పాటు చేసిన వెబ్‌సైట్‌లో శుక్రవారం ఉదయం నాటికి 50 వేల మంది పేర్లు నమోదయ్యాయి.

## అధికారులు అప్రమత్తంగా ఉండాలి

(మొదటి పేజీ తరువాయి)

ముఖ్యంగా మురుగు నీరు ఎక్కడా నిల్వ ఉండకుండా తగిన చర్యలు తీసుకోవటం ద్వారా దోమల వ్యాప్తిని కట్టడి చేయగలుగుతామన్నారు. ఘన వ్యర్థాల నిర్వహణ, రోజు వారీ చెత్త సేకరణ శాస్త్రీయపద్ధతిలో నిర్వహించాలని, ప్రజలు బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకుండా అవగాహన కల్పించాలని సూచించారు. "ఫ్రైడే -- డ్రైడే" కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా పకడ్బందీగా అమలు చేయాలని సూచించారు. ప్రతి గ్రామంలో క్రమం తప్పకుండా ఫాగింగ్ నిర్వహించాలని ఆదేశించారు. ప్రతి శుక్రవారం అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి మురుగునీటి నిల్వలను తొలగించే ఏర్పాటు చేయాలన్నారు. సోషల్ మీడియా, వాట్సప్ గ్రూపులు, మైక్ అనౌన్స్‌మెంట్ల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలకు ఇచ్చే తాగునీటి నాణ్యత, పారిశుధ్య నిర్వహణపై ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించాలన్నారు. తాగునీటి సరఫరా వ్యవస్థపై పర్యవేక్షణ ఉండాలని పైపు లైన్లలో లీకేజీలు లేకుండా చూడాలని ఆదేశించారు. ప్రజారోగ్య పరిరక్షణలో నిర్లక్ష్యాన్ని సహించేది లేదని స్పష్టం చేశారు.జారోగ్య పరిరక్షణను ప్రతి గ్రామ పంచాయతీ అత్యంత ప్రాధాన్యత అంశంగా తీసుకోవాలి. క్రమం తప్పకుండా పారిశుధ్య నిర్వహణ చేపట్టాలి, అన్ని పంచాయతీల్లోనూ బ్లీచింగ్ పౌడర్, క్లోరిన్ బిళ్లలు తగిన మోతాదులో అందుబాటులో ఉంచాలి. ముఖ్యంగా వర్షపు నీరు, మురుగునీరు ఎక్కడా నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవటం ద్వారా దోమల వ్యాప్తిని కట్టడి చేయాలి. శుభ్రత పాటించాలని సూచించారు.

## అమరావతిలో డ్రోన్ డెలివరీ నెట్‌వర్క్

(మొదటి పేజీ తరువాయి)

దిల్లీలోని కేంద్ర పౌరవిమానయానశాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు సమక్షంలో ఏపీ డ్రోన్ కార్పొరేషన్ ఎండీ గీతాంజలి శర్మ, ఎయిర్‌బౌండ్ వ్యవస్థాపకుడు నమన్ పుష్ప్ ఈ ఒప్పందంపై సంతకాలు చేశారు. అమరావతి, విజయవాడ, గుంటూరులను కలుపుతూ డ్రోన్ కార్యకలాపాలు ప్రారంభించనున్నారు. ఇందుకుగానూ ఎయిర్‌బౌండ్ సంస్థ లాజిస్టిక్స్, ఈ–కామర్స్, హెల్త్‌కేర్ రంగాల్లోని భాగస్వాములతో కలిసి పనిచేయనుంది. వచ్చే ఏడాది రోజుకు 10 వేల డ్రోన్ ఫ్లైట్స్ నిర్వహించే లక్ష్యంతో ఏపీ డ్రోన్ కార్పొరేషన్ పని చేస్తోంది. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ స్వదేశీ సంస్థతో భాగస్వామ్యం కుదుర్చుకుని, అతిపెద్ద డ్రోన్ డెలివరీ నెట్‌వర్క్‌ను నిర్మించనున్నామని తెలిపారు. దీని వల్ల కనెక్టివిటీతో పాటు ఉద్యోగాలను కల్పించవచ్చని ఆంధ్రప్రదేశ్ నిరూపించనుందన్నారు. ఏపీ డ్రోన్ కార్పొరేషన్ ఛైర్మన్ గీతాంజలి శర్మ మాట్లాడుతూ ఎయిర్‌బౌండ్ సంస్థ ఒక కొత్త డెలివరీ విధానాన్ని ఆరంభించడమే కాకుండా, కొత్త లాజిస్టిక్స్ వ్యవస్థకు పునాది వేస్తోందని పేర్కొనారు.అమరావతి రాజధాని ప్రాంతంలో డ్రోన్ డెలివరీ నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసేందుకు ఏపీ డ్రోన్ కార్పొరేషన్, ఎయిర్‌బౌండ్ మధ్య జరిగిన అవగాహన ఒప్పంద సంతకం కార్యక్రమాన్ని వీక్షించడం సంతోషంగా ఉంది. ప్రధాని నరేంద్ర మోదీ 'డిజిటల్ ఇండియా' దార్శనికత, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సాంకేతికత ఆధారిత పాలన స్ఫూర్తితో, ఏపీ డ్రోన్ ఆవిష్కరణల రంగంలో సరికొత్త అవకాశాలను అందిపుచ్చుకుంటోంది" అని కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఎయిర్‌బౌండ్ వ్యవస్థాపకుడు, సీఈవో నమన్ పుష్ప్ మాట్లాడుతూ డ్రోన్ డెలివరీ వస్తు రవాణా వ్యవస్థ స్వరూపాన్నే మారుస్తుందని తెలిపారు. 20 టన్నుల ట్రక్ సామర్థ్యంతో డ్రోన్లు ఒక్కో ప్యాకేజీని ఓ ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి సులభంగా చేరవేసే నెట్‌వర్క్‌ను నిర్మించడమే తమ లక్ష్యమని ఆయన అన్నారు.

## పొగాకు గిట్టుబాటు ధరకు ప్రభుత్వం గట్టి భరోసా

(మొదటి పేజీ తరువాయి)

రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని, కంపెనీలు నిర్ణయించిన నిబంధనలకు లోబడి పారదర్శకంగా కొనుగోళ్లు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని మంత్రి స్పష్టం చేశారు. ఖరీఫ్ సీజన్ దృష్ట్యా రాష్ట్రంలో యూరియా, డీఏపీ, కాంప్లెక్స్ సహా అన్ని రకాల ఎరువులు సమృద్ధిగా అందుబాటులో ఉన్నాయని, రైతులకు అవసరమైన సమయంలో ఎరువులు అందేలా నిల్వలు, రవాణా, పంపిణీపై నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని, కృత్రిమ కొరత, నిల్వదాచివేత, అధిక ధరలకు విక్రయాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఈ సందర్భంగా ఇటీవల జరిగిన పొగాకు బోర్డు 168వ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను కూడా మంత్రి ప్రస్తావించారు. 202627 పంట సంవత్సరానికి మార్కెట్ పరిస్థితులు, దేశీయ, అంతర్జాతీయ డిమాండ్, రైతుల ప్రయోజనాలను పరిగణనలోకి తీసుకుని ఆంధ్రప్రదేశ్‌లో పొగాకు ఉత్పత్తి పరిమాణాన్ని సుమారు 81 మిలియన్ కిలోలకు నిర్ణయించినట్లు తెలిపారు. అలాగే, ఈఅం పొగాకు మార్కెటింగ్ వ్యవస్థను మరింత బలోపేతం చేయడం, కొనుగోలు విధానంలో పారదర్శకత పెంచడం, పంట నియంత్రణ వ్యవస్థలో అవసరమైన సంస్కరణలు తీసుకురావడం, రైతులకు మెరుగైన ప్రయోజనాలు కల్పించడం కోసం అన్ని భాగస్వాములతో కూడిన ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. రైతుల ప్రయోజనాలే ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని, ఏ సమస్య వచ్చినా వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. పొగాకు రైతులకు గిట్టుబాటు ధర, ఖరీఫ్ రైతులకు సకాలంలో ఎరువుల సరఫరా జరిగేలా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు.

## తెలంగాణలో 13 మంది ఐఏఎస్ బదిలీ

**హైదరాబాద్, మన జనప్రగతి జూన్ 26:**

తెలంగాణలో 13 మంది ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సీఎం ముఖ్య కార్యదర్శిగా ఎన్.శ్రీధర్ నియమితులయ్యారు. విపత్తు నిర్వహణ శాఖ ముఖ్య కార్యదర్శిగా రాహుల్ బొజ్జాను నియమించారు. బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శిగా ఆయనకు అదనపు బాధ్యతలు అప్పగించారు. అటవీ శాఖ ముఖ్య కార్యదర్శిగా శైలజా రామయ్యర్ నియమితులు కాగా.. దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శిగా అదనపు బాధ్యతలు అప్పగించారు.

మన జనప్రగతి
తెలుగు దినపత్రిక
నిజం మా ధర్మం | వార్త మా వంతు | అభివృద్ధి మా లక్ష్యం
27 - 06 - 2026

# బాధిత కుటుంబానికి ఉద్యోగ సంఘం నాయకుల రూ.62 వేల ఆర్థిక సాయం



**దేవనకొండ మన జనప్రగతి జూన్ 26:** –దేవనకొండ మండలం తెర్నేకల్ గ్రామానికి చెందిన కొండగెరి మాదన్న కుటుంబానికి స్థానిక ఉద్యోగ సంఘం నాయకులు, వారి మిత్రులు కలిసి రూ. 62,000 ఆర్థిక సహాయం అందజేశారు. గత నెలలో మాదన్న భార్య క్షణికావేశంలో ఆత్మహత్య చేసుకోవడంతో, ఇద్దరు చిన్నారులు తల్లిని కోల్పోయి కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో పడింది. ఈ విషయం తెలుసుకున్న తెర్నేకల్ ఉద్యోగ సంఘం నాయకులు, స్నేహితులు మానవతా దృక్పథంతో స్పందించి తమ వంతు విరాళాలను సేకరించి శుక్రవారం బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఆపదలో ఉన్న కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించడం ద్వారా వారికి కొంత మేర ఉపశమనం, మనోధైర్యం కలుగుతుందని తెలిపారు. అదే విధంగా, వివేకానంద పబ్లిక్ స్కూల్ ప్రధానోపాధ్యాయులు కోటేష్ బాధిత కుటుంబంలోని ఒక చిన్నారికి పూర్తిగా ఉచితంగా విద్యను అందించే బాధ్యతను తీసుకుంటున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగ సంఘం మిత్రులు బి. సుధాకర్ బాబు, రాజశేఖర్, మధుసూదన్, వీరేష్, రామచంద్ర, మధు, దినేష్, యోగేంద్ర, కోటేష్, వాసు, లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

# జూన్ 28న పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

## • ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలి:జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి




**కర్నూలు బ్యూరో మన జనప్రగతి జూన్ 26:** –జిల్లాలో జూన్ 28 నుంచి 30 వరకు నిర్వహించనున్న పల్స్ పోలియో ఇమ్యునైజేషన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి అధికారులను ఆదేశించారు. శుక్రవారం టెలికాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించిన జిల్లా టాస్క్ ఫోర్స్ కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడుతూ, జూన్ 28న పోలియో బూత్‌లలో చుక్కలు వేయనున్నట్లు, ఆ రోజు మిస్ అయిన పిల్లలకు జూన్ 29, 30 తేదీల్లో ఇంటింటికీ వెళ్లి చుక్కలు వేయనున్నట్లు తెలిపారు. జిల్లాలోని 0 నుంచి 5 సంవత్సరాల వయస్సు గల 3,52,164 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయేందుకు 1,630 పోలియో బూత్‌లు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. తల్లిదండ్రులందరూ తమ పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించి పోలియో రహిత సమాజ నిర్మాణానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంపై పట్టణాలు, గ్రామాల్లో విస్తృత ప్రచారం చేపట్టాలని, విద్యార్థులతో ర్యాలీలు నిర్వహించి ప్రజల్లో అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. అంగన్వాడీ, ఆశా, ఏఎన్ఎంల సహకారంతో ఒక్క చిన్నారి కూడా మిస్ కాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. పోలియో వ్యాక్సిన్ నిల్వ కేంద్రాల్లో నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖలను ఆదేశించారు. ఈ సమావేశంలో డీఎంహెచ్‌వోతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


# పార్టీ కోసం కష్టపడండి పార్టీ అండగా ఉంటుంది: రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డి



**పీలేరు మన జనప్రగతి జూన్ 26 :–** పీలేరు పట్టణంలోని వి.ఎస్.ఆర్. కళ్యాణ మండపంలో పీలేరు, కలికిరి, కే.వి.పల్లి మండలాలకు సంబంధించిన సమగ్ర ఓటరు జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియపై అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి రాజంపేట పార్లమెంట్ సభ్యులు పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, ప్రతి అర్హుడైన ఓటరు పేరు ఓటరు జాబితాలో తప్పనిసరిగా నమోదు అయ్యేలా పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డిమాట్లాడుతూ ప్రజాస్వామ్యానికి ఓటు హక్కు ఏ బలమని ఓటర్ నమోదు మార్పులు సవరణలు అభ్యంతరాలు పరిష్కారాలపై అవగాహన కల్పించాలని తెలిపారుఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపీ ఎమ్మెల్సీ శ్రీమతి కల్పలత రెడ్డి ఏపీఎండీసీ మాజీ డైరెక్టర్ శ్రీ హరీష్ రెడ్డి పెద్దిరెడ్డి సుధీర్ రెడ్డి నల్లారి తిమ్మారెడ్డి , డా. ఇక్బాల్ అహ్మద్ ఎంపీపీ సతీష్ రెడ్డి జెడ్పిటిసి రత్నశేఖర్ రెడ్డి వైఎస్ఆర్సిపి మండల అధ్యక్షుడు జగన్మోహన్ రెడ్డి సుంకర చక్రధర్ పెద్దిరెడ్డి ద్వారకనాథ్ రెడ్డి భువనేశ్వర్ రెడ్డి లోకనాథరెడ్డి కాలనీ చిన్న ఆనంద మునీర్ షాకీర్ శ్రీనాథరెడ్డి జైపాల్ రెడ్డి తదితరులు

# త్యాగానికి ప్రతీక మొహర్రం

**వీరబల్లి మన జనప్రగతి జూన్ 26 :–** త్యాగానికి ప్రతీకగా మొహర్రంను నిర్వహిస్తారని వితర్డిఎస్ సురేంద్రారెడ్డి పేర్కొన్నారు. కడప జిల్లాలోని వీరబల్లి మండలంలో పీర్లపండుగ మూడు రోజులు పాటు పెద్దఎత్తున నిర్వహించారు. పూర్వకాలం నుంచి హిందూ ముస్లింలు కులమతాలకతీతంగా జరుపుకునే పండుగ మొహరమని అన్నారు. అనంతరం వీరబల్లికి చెందిన రెడ్డి బాషా జ్ఞాపకార్థం వారి కుమారులు అల్తాఫ్, హబీబ్ లు భక్తులకు పెద్ద ఎత్తున అన్నదానం చేశారు.



# మాదకద్రవ్యాలు వద్దు..ఆరోగ్యకరమైన జీవితం ముద్దు

**అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం**

**సెట్కూరు సీఈఓ డాక్టర్ వేణుగోపాల్**





**కర్నూలు బ్యూరో మన జనప్రగతి జూన్ 26:** –మాదకద్రవ్యాలు వద్దు..ఆరోగ్యకరమైన జీవితం ముద్దు అని సెట్కూరు సీఈఓ డాక్టర్ వేణుగోపాల్ అన్నారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా శుక్రవారం సి. బెళగల్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల లో జిల్లా యువజన సంక్షేమ శాఖ – సెట్కూరు ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల వ్యతిరేకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సెట్కూరు సీఈఓ డాక్టర్ వేణుగోపాల్ మాట్లాడుతూ మాదకద్రవ్యాలు వ్యక్తిని మాత్రమే కాదు, కుటుంబాన్ని, సమాజాన్ని, దేశ భవిష్యత్తును కూడా నాశనం చేస్తాయి అన్నారు. ప్రతి ఒక్కరూ మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి, ఇతరులను కూడా వాటి బారిన పడకుండా చైతన్యం కల్పించాలి అని పిలుపునిచ్చారు. ఆరోగ్యవంతమైన యువతే దేశానికి నిజమైన సంపద. ప్రస్తుత యువతకు టీనేజ్ లో స్నేహితులు మగతనం అంటే సిగరెట్లు తాగడం, బీరు తాగడం అని ఇగోని రెచ్చగొడుతుంటారని, అటువంటి రెచ్చగొట్టే మాటలకూ లొంగకుండా మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటేనే ఆరోగ్యకరమైన, అభివృద్ధి చెందిన సమాజాన్ని నిర్మించగలమన్నారు. డ్రగ్స్ వల్ల యువత భవిష్యత్తు దెబ్బతింటుందని, కావున వాటికి దూరంగా ఉండాలని సూచించారు. ప్రస్తుతం మనం దేశం ఎదుర్కొంటున్న కీలక సమస్యలలో ఒకటైన మదకద్రవ్యల వినియోగం ని అరికట్టి మాదక ద్రవ్య రహిత సమాజం ఏర్పాటు కు యువత కృషి చేయాలని తెలిపారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సమాజంలోని ప్రతి ఒక్కరూ యువతపై పర్యవేక్షణ ఉంచి వారు డ్రగ్స్ బారిన పడకుండా చూడాలని కోరారు. మాదకద్రవ్యాలకు ‘నో‘ చెప్పాలని ఆరోగ్యకరమైన జీవితానికి ‘అవును‘ చెప్పాలని విద్యార్థులకు తెలిపారు. తదుపరి సి.బెళగల్ ఏ.ఎస్.ఐ నాగయ్య గారు మాట్లాడుతూ డ్రగ్స్ విక్రయాలు లేదా వినియోగం జరుగుతున్నట్లు అనుమానస్పద దృష్యాలు మీకు కనిపిస్తే వెంటనే టోల్ ఫ్రీ నెంబర్ 1972 కు సమాచారం ఇవ్వాలని సూచించారు. గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ చింతలయ్య గారు మాట్లాడుతూ చదువుకొనే వయసులో చెడు స్నేహల వల్ల సిగరెట్లు, బీరు మొదలగు వాటి తో మొదలై మత్తు పదార్థాలకు బానిసలుగా మారుతున్నారని కావున విద్యార్థులు చెడు స్నేహల జోలికి వెళ్లకుండా చదువు పై ద్రుష్టి పెట్టి మంచి మార్కులు సాధించి తమకు జన్మనిచ్చిన తల్లిదండ్రులకు,పుట్టిన ఊరుకు మంచిపేరు తేవాలని కోరారు.

# చిన్నారి నిత్విక మృతి కేసు... పులివెందులలో ఉద్రిక్తత

**హత్య కేసు నమోదు చేసిన పోలీసులు**

**పాతకక్షలతోనే చిన్నారి నిత్విక దారుణ హత్య**

**పులివెందుల డీఎస్పీ మురళీ నాయక్**





**పులివెందుల అర్బన్ మన జనప్రగతి జూన్ 26:** కడప జిల్లా పులివెందుల నియోజకవర్గం లింగాల మండలం లోపట్నూతలపల్లె గ్రామంలో చిన్నారి నిత్విక మృతి కేసు తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. తమకు న్యాయం చేయాలంటూ నిత్విక కుటుంబ సభ్యులు,బంధువులు పులివెందుల రూరల్ పోలీస్ స్టేషన్ ఎదుట భారీ ఆందోళనకు దిగారు. అనంతరం పట్టణంలోని పూలంగళ్ల కూడలిలో బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. దీంతో అక్కడ భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. విషయం తెలుసుకున్న డీఎస్పీ మురళీ నాయక్ సంఘటనా స్థలానికి చేరుకుని,బాధితులతో మాట్లాడి నచ్చజెప్పడంతో వారు ఆందోళన విరమించారు. డీఎస్పీ మురళీ నాయక్ మీడియాతో మాట్లాడుతూపాతకక్షలతోనే చిన్నారి నిత్విక దారుణ హత్య జరిగినట్టు నిర్ధారించినట్టు తెలిపారు. ఈ కేసు వివరాలను వెల్లడిస్తూ చిన్నారి తల్లి సృజన ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎఫ్ఐఆర్ నంబర్ 46/2026గా హత్య కేసు నమోదు చేసి నూతన చట్టాల ప్రకారం సంబంధిత సెక్షన్ల కింద కేసును దర్యాప్తు చేస్తున్నామని అన్నారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు క్లూస్ టీం,డాగ్ స్క్వాడ్ రంగంలోకి దిగి ఘటనా స్థలం నుండి కీలక ఆధారాలను సేకరించాయని,ఫిర్యాదులో పేర్కొన్న ప్రధాన అనుమానితురాలు స్వాతిని త్వరలోనే అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరుస్తామని,పోస్టుమార్టం నివేదిక ఆధారంగా తదుపరి చట్టపరమైన చర్యలు ఉంటాయని డీఎస్పీ స్పష్టం చేశారు. పోలీసుల ప్రాథమిక విచారణ ప్రకారం సృజన, స్వాతి కుటుంబాల మధ్య గత కొంతకాలంగా తీవ్ర వివాదాలు నడుస్తున్నాయని గతంలో ఇరు వర్గాల మధ్య జరిగిన గొడవల్లో వాహనాలకు నిప్పంటించిన ఘటన కూడా చోటుచేసుకుందన్నారు. ఆ సమయంలో పోలీసులు అనుమానాస్పద కేసు నమోదు చేసి గొడవల నేపథ్యంలో ఇరు కుటుంబాలు తమ ఇళ్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని పోలీసులు గతంలోనే సూచించారన్నారు. ప్రస్తుతం ఆ సీసీటీవీ ఫుటేజ్‌ను పోలీసులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారని గత వివాదాల దృష్ట్యా ఇరు కుటుంబాలకు చెందిన ఐదుగురిపై పోలీసులు గతంలోనే బైండోవర్ కేసులు నమోదు చేశారని ఆ ఆదేశాలను ఉల్లంఘించినందుకు గానూ స్వాతిపై తదుపరి చర్యల కోసం తహసీల్దార్‌కు నివేదిస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు. బాధిత కుటుంబానికి భరోసా కల్పిస్తూ, బాలిక తల్లి సృజనకు మీడియా సమక్షంలోనే ఎఫ్ఐఆర్ కాపీని పోలీసులు అందజేశారు. ఈ కేసు దర్యాప్తును పులివెందుల రూరల్ సీఐ శాంతిలాల్,ఎస్సై జగదీశ్వర్ రెడ్డి పర్యవేక్షిస్తుండగా పరిశీలన అధికారిగా డీఎస్పీ మురళీ నాయక్ వ్యవహరిస్తున్నారు. కేసులో పూర్తి స్థాయి విచారణ జరిపి,పక్కా ఆధారాలతో నిందితులకు కఠిన శిక్ష పడేలా చూస్తామని పోలీసులు హామీ ఇచ్చారు.

# వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ జీవీఆర్ కరాటే అకాడమి







**హైదరాబాద్, మన జనప్రగతి జూన్ 26:** అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ఇంటర్నేషనల్ పర్యవేక్షణలో శుక్రవారం కాచిగూడ లోని జీవీఆర్ కరాటే అకాడమీ లో నిర్వహించిన కార్యక్రమంలో కరాటే విద్యార్థులు అద్భుతమైన ప్రదర్శన కనబరిచి వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సాధించారు. కరాటే మాస్టర్ డాక్టర్ జిఎస్ గోపాల్ రెడ్డి కరాటే విద్యార్థులైన భార్గవసాయి, ప్రణీత్, నైతిక్ రెడ్డి, సంజన, తన్వి, చిన్మయి ప్రియాలతో కలిసి ఈ రికార్డు చేశారు. 36 సెకండ్లలో 6 మంది విద్యార్థుల తలలపై ఉంచిన 26 యాపిల్లును చేతితో బ్రేక్ చేసి రికార్డు సృష్టించారు. వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ఇంటర్నేషనల్ ఇండియా చీఫ్ కో–ఆర్డినేటర్ బింగి నరేందర్ గౌడ్ రికార్డు చేసిన గోపాల్ రెడ్డి తో పాటు విద్యార్థులకు సర్టిఫికెట్స్, మెడల్స్ ను అందజేశారు. కార్య క్రమంలో కార్పొరేటర్లు మహాలక్ష్మి రామన్ గౌడ్, కన్నె ఉమా రమేష్ యాదవ్, డాక్టర్ ఎ.కృష్ణారెడ్డి, కోట్ల నిరంజన్ రెడ్డి, కరీమ్, అమృతరెడ్డి, గణ సంతోషిణి రెడ్డి, రాజు, సుధాకర్, అనఘ, షైనీ, ద్వైత తదితరులు పాల్గొని రికార్డు గ్రహీతలు అభినందించి సత్కరించారు. జివిఆర్ కరాటే అకాడమీ వ్యవస్థాపకులు, డైరెక్టర్ డాక్టర్ జి.ఎస్. గోపాల్ రెడ్డి తన అసాధారణ కరాటే నైపుణ్యాన్ని ప్రదర్శిస్తూ.. ఆరుగురు విద్యార్థుల తలపై ఉంచిన 26 ఆపిల్స్‌ను కేవలం 36 సెకన్లలో హ్యాండ్ చాప్స్ ద్వారా బ్రేక్ చేసి సరికొత్త ప్రపంచ రికార్డును నెలకొల్పారు. ఈ సందర్భంగా వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ఇంటర్నేషనల్ ఇండియా చీఫ్ కో–ఆర్డినేటర్ శ్రీ బింగి నరేందర్ గౌడ్ మాట్లాడుతూ.. అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా సమాజానికి చైతన్యాన్ని కలిగించే సందేశంతో ఈ ప్రపంచ రికార్డును నిర్వహించడం అభినందనీయమని అన్నారు. కేవలం 36 సెకన్లలో అత్యంత క్రమశిక్షణ, ఏకాగ్రత, భద్రతా ప్రమాణాలతో ఈ విన్యాసాన్ని విజయవంతంగా పూర్తి చేసిన డాక్టర్ జి.ఎస్. గోపాల్ రెడ్డిని అభినందించారు. ప్రపంచ రికార్డులు కేవలం ప్రతిభను ప్రదర్శించడానికి మాత్రమే కాకుండా సమాజానికి ఉపయోగపడే సందేశాన్ని అందించేలా ఉండాలని, ఆ దిశగా డాక్టర్ గోపాల్ రెడ్డి ఎన్నో సంవత్సరాలుగా కృషి చేస్తున్నారని కొనియాడారు. అలాగే ఈ రికార్డులో పాల్గొన్న భార్గవ సాయి, ప్రణీత్, నైతిక్ రెడ్డి, సంజన, తన్వి, చిన్మయి ప్రియ లను ప్రత్యేకంగా అభినందిస్తూ, వారి ధైర్యం, విశ్వాసం, క్రమశిక్షణ ఈ ప్రపంచ రికార్డు విజయానికి ప్రధాన కారణమని పేర్కొన్నారు. డాక్టర్ జి.ఎస్. గోపాల్ రెడ్డి, పాల్గొన్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు మరియు జివిఆర్ కరాటే అకాడమీ బృందానికి వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ఇంటర్నేషనల్ తరఫున శుభాకాంక్షలు తెలియజేస్తూ, భవిష్యత్తులో మరిన్ని ప్రపంచ రికార్డులు సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా మాజీ హిమాయత్‌నగర్ కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్, మాజీ కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్, వివేక్ హాస్పిటల్ వ్యవస్థాపకులు డాక్టర్ ఎ. కృష్ణా రెడ్డి, నేతాజీ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ వ్యవస్థాపకులు మరియు డైరెక్టర్ కోట్ల నిరంజన్ రెడ్డి, జివిఆర్ కరాటే అకాడమీ బ్లాక్ బెల్ట్స్ కరీమ్, అమృత రెడ్డి, గణ సంతోషిణి రెడ్డి, రాజు, సుధాకర్, అనఘ, షైనీ, ద్వైతతో పాటు అకాడమీ విద్యార్థులు, తల్లిదండ్రులు, క్రీడాభిమానులు మరియు పలువురు ప్రముఖులు పాల్గొని డాక్టర్ జి.ఎస్. గోపాల్ రెడ్డి మరియు విద్యార్థులను అభినందించారు. ఈ ప్రపంచ రికార్డు ద్వారా యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి క్రీడలు, క్రమశిక్షణ, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని జివిఆర్ కరాటే అకాడమీ పిలుపునిచ్చింది.

మన జనప్రగతి
తెలుగు దినపత్రిక
27 - 06 - 2026

## ఘనంగా మొహరం పండుగ వేడుకలు





**గాలివీడు మన జనప్రగతి జూన్ 26:-**గాలివీడు మండలం అరవీడు గ్రామంలో మొహరం పండుగ వేడుకలు భక్తిశ్రద్ధలతో, మత సామరస్య వాతావరణంలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు టీడీపీ గాలివీడు మండల ప్రధాన కార్యదర్శి కసిరెడ్డి వెంకట శివారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా గ్రామ ప్రజలు ఆయనకు ఘన స్వాగతం పలికి శాలువాతో సన్మానించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. కసిరెడ్డి వెంకట శివారెడ్డి గ్రామస్తులకు మొహరం పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తూ, అన్ని మతాల ప్రజలు పరస్పర ప్రేమ, సోదరభావంతో కలిసి జీవించడమే సమాజ అభివృద్ధికి బాట అని పేర్కొన్నారు.ప్రజల సేవే తన లక్ష్యమని, ప్రజల ఆదరణే తనకు మరింత సేవ చేయడానికి ప్రేరణ అని ఆయన అన్నారు. గ్రామ ప్రజలు చూపిన ఆప్యాయత, అభిమానానికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సరికొత్త టెక్నాలజీతో లక్ష్మీ బోటిక్ సెంటర్ ప్రారంభం



**గాలివీడు మన జనప్రగతి జూన్ 26:-**గాలివీడు పట్టణంలో సరికొత్త టెక్నాలజీతో ఏర్పాటు చేసిన లక్ష్మీ బోటిక్ సెంటర్ & ఎంబ్రాయిడరీ వర్క్ సెంటర్ను శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. పెదగంటి కొత్తపల్లికి చెందిన టమటం పుల్లారెడ్డి కుమారుడు సిద్ధారెడ్డి ఈ సెంటర్‌ను ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా వైఎస్ఆర్సిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఆవుల నాగభూషణ్ రెడ్డి రిబ్బన్ కటింగ్ చేసి బోటిక్ సెంటర్‌ను ప్రారంభించారు. ఆధునిక యంత్రాలతో నాణ్యమైన ఎంబ్రాయిడరీ, బోటిక్ సేవలను అందించనున్న ఈ సెంటర్ స్థానికులకు ఉపాధి అవకాశాలతో పాటు మెరుగైన సేవలు అందిస్తుందని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో కాల్వపల్లి రమణారెడ్డి, నల్లబత్తిని రమణారెడ్డి, బొక్కనగారి నాగిరెడ్డి, మూలపల్లి రమణారెడ్డి, టమటం మధుసూదన్ రెడ్డి, వై.ఎస్. రమణారెడ్డి, మోడమ్ వెంకటేష్ తదితరులు పాల్గొని నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు.

## సేవా కార్యక్రమాలతో ఆదర్శంగా నిలిచిన తల్లపనేని కుటుంబం

**- 120 మంది విద్యార్థులకు అల్పాహారం,వృద్ధాశ్రమంలో అన్నదానం చేసిన మనఊరికోసం స్వచ్ఛంద సేవా సంస్థ**



**సిద్ధవటం మన జనప్రగతి జూన్ 26:-**మండలంలోని మాధవరం-1 గ్రామానికి చెందిన మనఊరికోసం స్వచ్ఛంద సేవా సంస్థకు చెందిన సభ్యుడు తల్లపనేని భాను ప్రకాష్ తనయుడు భరత్ నాయుడు జన్మదినం సందర్భంగా సంస్థ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. కడప నగరంలోని సుభాష్ చంద్రబోస్ ఆవాసీయ విద్యాలయంలో ఉన్న 120 మంది పిల్లలకు అల్పాహారం ఏర్పాటు చేశారు. అలాగే పోరుమామిళ్ల సమీపంలోని వివేకానంద సేవాశ్రమంలోని వృద్ధులకు మధ్యాహ్న అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ చైర్మన్ అవ్వారు రవిశంకర్ మాట్లాడుతూ భరత్ నాయుడు జన్మదినాన్ని పురస్కరించుకుని కుటుంబ సభ్యుల సహకారంతో సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. భరత్ మరెన్నో జన్మదిన వేడుకలు జరుపుకుంటూ సమాజ సేవలో ముందుండాలని ఆకాంక్షించారు. మనఊరికోసం స్వచ్ఛంద సేవా సంస్థ తరఫున జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## పెద్దకొండయ్య ఆరోపణలు అవాస్తవం: కూరపాటి గంగులయ్య



**కడప మన జనప్రగతి జూన్ 26:-**వల్లూరు మండలం ఏ.ఒబాయపల్లె గ్రామానికి చెందిన కూరపాటి పెద్దకొండయ్య తనపై చేసిన ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని కూరపాటి గంగులయ్య పేర్కొన్నారు. శుక్రవారం కడపలోని హోటల్ హరితలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన తన వివరణ వెల్లడించారు.ఈ సందర్భంగా గంగులయ్య మాట్లాడుతూ, 1992లో తన అన్న పెద్దకొండయ్య 40 తులాల బంగారం, రూ.26 వేల నగదు తీసుకుని ఇంటి నుంచి వెళ్లిపోయారని తెలిపారు.కుటుంబ సభ్యులంతా వెతికినా ఆయన ఆచూకీ లభించలేదని, దాదాపు 15 సంవత్సరాల తర్వాత బంధువు మృతి విషయం తెలుసుకుని గ్రామానికి తిరిగి వచ్చారని చెప్పారు. అప్పటి నుంచి గ్రామానికి రాకపోకలు కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు.వల్లూరులోని 2 ఎకరాల 56 సెంట్ల భూమిని 2008లో తన అన్న పెద్దకొండయ్య అమీర్‌బాబుకు విక్రయించారని, అలాగే గోటూరు పరిధిలోని 5 ఎకరాల 34 సెంట్ల భూమిని 2021లో పెద్ద దస్తగిరికి అమ్మారని తెలిపారు.డబ్బు, రాజకీయ పలుకుబడిని ఉపయోగించి తన భూమిని అక్రమంగా ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకున్నారని ఆరోపించారు. దీనిపై ప్రశ్నిస్తే తనను చంపేస్తామని బెదిరింపులకు పాల్పడుతున్నారని, ఇందుకు పెద్దకొండయ్య కుటుంబ సభ్యులు, బంధువులు కూడా సహకరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.తాను హౌసింగ్ శాఖలో కాంట్రాక్టు పద్ధతిలో వర్క్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేశానని, ప్రస్తుతం కాలు విరగడంతో సెలవులో ఉన్నానని తెలిపారు. అలాగే తన పేరుతో ప్రచారం జరుగుతున్న హెచ్‌పీ పెట్రోల్ బంక్ తనది కాదని, అది హెచ్‌పీ కంపెనీకి చెందినదేనని స్పష్టం చేశారు.తనపై చేసిన ఆరోపణలన్నీ నిరాధారమని, అవసరమైన ఆధారాలతో వాటిని ఖండిస్తానని కూరపాటి గంగులయ్య తెలిపారు.

## యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి: డాక్టర్ బత్తుల రాయుడు




**నంద్యాల మన జనప్రగతి జూన్ 25:-**నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా సఫర్డ్ సొసైటీ, ఏపీ వీహెచ్ఏ మరియు స్థానిక స్వచ్ఛంద సేవా సంస్థల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జాతీయ బీసీ సంక్షేమ సంఘం కార్యదర్శి డాక్టర్ బత్తుల రాయుడు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం జూన్ 26న అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం మరియు అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని నిర్వహించడం ద్వారా ప్రజల్లో డ్రగ్స్ వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించడం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. మాదకద్రవ్యాల వినియోగం యువత భవిష్యత్తును నాశనం చేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు.గంజాయి,కొకైన్,హెరాయిన్ వంటి మత్తు పదార్థాల వినియోగం శారీరక, మానసిక ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు. మత్తుకు బానిస కావడం వల్ల కుటుంబ సంబంధాలు దెబ్బతినడంతో పాటు నేరాల సంఖ్య కూడా పెరిగే ప్రమాదం ఉందన్నారు. ముఖ్యంగా యువత చెడు స్నేహాలు, ఒత్తిడి, ఆందోళనల కారణంగా మత్తు పదార్థాలకు అలవాటు పడుతున్నారని చెప్పారు.యువత మాదకద్రవ్యాల ఉచ్చులో పడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విద్యాసంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వ శాఖలు సమన్వయంతో విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు.ఈ కార్యక్రమంలో స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు అరుణ, లక్ష్మీదేవి, శివరామిరెడ్డి, బర్నబాసు, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

## అగస్త్యేశ్వరాలయ అక్రమాలపై ఉన్నతస్థాయి దర్యాప్తు జరపాలి

**• నిజాలు బయటపడే వరకు పోరాటం కొనసాగిస్తాం: దేవాలయాల పరిరక్షణ సమితి**



**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి జూన్ 26:-** ప్రొద్దుటూరులోని అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో ఆభరణాలు, నగదు గల్లంతైన ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఉన్నతస్థాయి దర్యాప్తునకు ఆదేశించాలని దేవాలయాల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు పుప్పాల శ్రీనాథరెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక శ్రీరాములపేట ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఆలయానికి చెందిన విలువైన ఆభరణాలు, సుమారు రూ. కోటి నగదు మాయమైన ఘటనలో ఇప్పటివరకు అసలు నిందితులపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు.నిజ నిర్ధారణ కమిటీ పేరుతో కాలయాపన జరుగుతోందని, దీంతో భక్తుల్లో అనుమానాలు మరింత పెరుగుతున్నాయని పేర్కొన్నారు. ఈ వ్యవహారంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శంకర్ బాలాజీపై ప్రభుత్వం ఇప్పటికీ చర్యలు తీసుకోకపోవడం విచారకరమన్నారు. కింది స్థాయి అధికారులతో విచారణ చేపడితే వాస్తవాలు వెలుగులోకి రావని, స్వతంత్రంగా ఎన్ఫోర్స్‌మెంట్ విభాగం లేదా ఉన్నతస్థాయి సంస్థతో సమగ్ర దర్యాప్తు జరిపించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఆలయాలపై భక్తుల విశ్వాసాన్ని కాపాడాలంటే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవడం తప్పనిసరని అన్నారు.ప్రొద్దుటూరు అర్బన్-1 పట్టణాధ్యక్షుడు వంకదారి నరేంద్రరావు మాట్లాడుతూ, ఆలయంలో జరిగిన అక్రమాలకు సంబంధించిన ఆధారాలు ఉన్నప్పటికీ అధికారులు స్పందించకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికే పలు నిరసన కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రికి వినతిపత్రం అందజేసినా ఫలితం కనిపించలేదని చెప్పారు. త్వరలో కలెక్టరేట్ ఎదుట భారీ ధర్నా నిర్వహించి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర కోశాధికారి సి.వి. జయలక్ష్మి మాట్లాడుతూ, అగస్త్యేశ్వరాలయంలో వెలుగులోకి వచ్చిన అక్రమాలు మంచుకొండలో చిన్న భాగం మాత్రమేనని, ఇంకా అనేక విషయాలు బయటకు రావాల్సి ఉందన్నారు. దేవాలయాల ఆస్తులు, నగలు, నిధుల నిర్వహణలో పూర్తి పారదర్శకత తీసుకురావాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.
విలేకరుల సమావేశంలో జనసేన నాయకుడు బాబ్జీ, ధార్మిక సెల్ నాయకుడు భూమిరెడ్డి భాస్కర్‌రెడ్డి, బీజేపీ నాయకులు హరికృష్ణ, సంజీవ్ గౌడ్, మల్లేష్ యాదవ్, పరమేశ్వరరావు, ఓబీసీ మోర్చా నాయకుడు వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

## యువతే భారత భవిష్యత్తు - విద్యా వ్యవస్థలో సమూల సంస్కరణలు అవసరం

**• డీసీసీ అధ్యక్షురాలు విజయజ్యోతి**



**కడప మన జనప్రగతి జూన్ 26:-**భారతదేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని, ప్రతి విద్యార్థిలో అపారమైన ప్రతిభ దాగి ఉందని జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షురాలు ఎన్.డి. విజయజ్యోతి అన్నారు. శుక్రవారం కడపలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు.రాజస్థాన్‌లోని కోటాలో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ నిర్వహించిన "చాత్రోం కీ గూంజ్" కార్యక్రమంలో దేశ విద్యా వ్యవస్థపై వ్యక్తమైన అభిప్రాయాలను ప్రస్తావిస్తూ, విద్యార్థుల ఆశయాలను నెరవేర్చే విధంగా విద్యా వ్యవస్థను సంస్కరించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం విద్యా వ్యవస్థ విద్యార్థులపై అధిక ఒత్తిడి మోపుతూ, కోచింగ్ కేంద్రాలపై ఆధారపడే పరిస్థితి తీసుకొచ్చిందని విమర్శించారు.నీట్, జేఈఈ, యూపీఎస్సీ, ఎస్సెస్సీ, ఆర్ఆర్బీ తదితర పోటీ పరీక్షల కోసం కుటుంబాలు భారీగా ఖర్చు చేస్తున్నాయని, ఇది కేంద్ర విద్యా బడ్జెట్‌కు సమానంగా ఉందన్నారు. గత పదేళ్లలో 89 ప్రశ్నాపత్రాల లీకేజీల వల్ల సుమారు 6.5 కోట్ల మంది అభ్యర్థులు నష్టపోయారని ఆరోపించారు.విద్యార్థులకు తక్కువ ఖర్చుతో నాణ్యమైన విద్య అందిస్తూ, వారి ప్రతిభను ప్రోత్సహించే విద్యా విధానం అవసరమని పేర్కొన్నారు. యువత అభిప్రాయాలకు కాంగ్రెస్ పార్టీ ప్రాధాన్యత ఇస్తుందని, వారి హక్కుల కోసం పోరాటం కొనసాగిస్తామని తెలిపారు.దేశవ్యాప్తంగా చేపట్టిన "జాయిన్ ఇండియా" ఉద్యమంలో విద్యార్థులు, యువత పెద్దఎత్తున పాల్గొని విద్యా వ్యవస్థ సంస్కరణ కోసం తమ గొంతు వినిపించాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో కడప, కమలాపురం అసెంబ్లీ కోఆర్డినేటర్లు బండి జకరయ్య, మీగడ అశోక్ కుమార్ రెడ్డి, సిరాజుద్దీన్, రఫీఖ్ ఖాన్, కోటపాటి లక్ష్మయ్య, కేకేసీ జిల్లా చైర్మన్ దాసరి శ్రీనివాసులు, షామీర్ హుస్సేన్, మామిళ్ల బాబు, జవహర్ బాలమంచు జిల్లా అధ్యక్షులు పూల్లూరు భాష, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు నంది మండలం వెంకటసుబ్బయ్య, పాలగిరి శివ, మంచాల అవినాష్, శీలం గంగయ్య, జాబీర్ అలీ, వీరయ్య, అమీర్ భాష, పాలెం హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## చంద్రగిరిలో మలేరియా, డెంగ్యూపై వ్యాధులపై ప్రజలకు అవగాహన




**బొమ్మనహల్ మన జనప్రగతి జూన్ 26:-**బొమ్మనహల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని చంద్రగిరి గ్రామంలో మలేరియా,డెంగ్యూ జ్వరాల నివారణపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు,ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ..ప్రస్తుతం వర్షాకాలంలో దోమల వ్యాప్తి ఎక్కువగా ఉండే నేపథ్యంలో డ్రైడే పాటించాలని,నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు,మరి నీటి నిల్వ పాత్రలకు మూతలు ఉంచడం,పాత టైర్లు,కొబ్బరి చిప్పలు,ప్లాస్టిక్ వస్తువులు వంటి వాటిలో నీరు నిలవకుండా తొలగించాలని తెలిపారు, రాత్రివేళల్లో దోమతెరలు ఉపయోగించడం,శరీరాన్ని పూర్తిగా కప్పే దుస్తులు ధరించడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా మలేరియా, డెంగ్యూ నుంచి రక్షణ పొందవచ్చని వివరించారు, కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్త వెంకటరమణ,ఎంఎల్‌హెచ్‌పీ రాధమ్మ,ఆశా కార్యకర్త సుగుణ, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ సర్వే పనుల్లో వేగం పెంచాలి

**• ప్రతి అర్హుడి పేరు ఓటరు జాబితాలో ఉండేలా చూడాలి: తహసీల్దార్ శివకుమార్**

**• క్షేత్రస్థాయిలో సర్వే పనులను పరిశీలించిన ఆర్డీఓ నారాయణరెడ్డి**

**పీలేరు మన జనప్రగతి జూన్ 26 :-** ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (SIR) కార్యక్రమాన్ని ఎలాంటి లోపాలకు తావు లేకుండా, ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం పారదర్శకంగా నిర్వహించాలని పీలేరు మండల తహసీల్దార్ శివకుమార్ అన్నారు. శుక్రవారం పీలేరు మండలంలోని పలు గ్రామాల్లో బీఎల్ఓలు నిర్వహిస్తున్న ఇంటింటి సర్వే పనులను ఆర్డీఓ, పర్యవేక్షణ అధికారి నారాయణరెడ్డితో కలిసి ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా తహసీల్దార్ శివకుమార్ మాట్లాడుతూ, ప్రతి ఇంటిని తప్పనిసరిగా సందర్శించి అర్హులైన ప్రతి ఓటరు వివరాలను క్షుణ్ణంగా నమోదు చేయాలని బీఎల్ఓలకు సూచించారు. మార్పులు, చేర్పులు, తొలగింపుల ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని తెలిపారు.ప్రజలు అందించే సమాచారం ఆధారంగా పూర్తి స్థాయిలో ధృవీకరణ చేపట్టి, ఓటరు జాబితా నాణ్యతను మెరుగుపరచాలని ఆదేశించారు.ఆర్డీఓ నారాయణరెడ్డి మాట్లాడుతూ, SIR సర్వే ప్రజాస్వామ్య ప్రక్రియలో అత్యంత కీలకమైన కార్యక్రమమని అన్నారు. ప్రతి బీఎల్ఓ తన పరిధిలోని ప్రతి ఇంటిని సందర్శించి సర్వేను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. ప్రజల్లో అపోహలు సృష్టించే ప్రచారాలను నమ్మవద్దని, అధికారిక సమాచారాన్నే విశ్వసించాలని తెలిపారు. సర్వేలో నిర్లక్ష్యం లేదా తప్పిదాలకు ఎలాంటి అవకాశం ఉండకూడదని హెచ్చరించారు.అనంతరం అధికారులు బీఎల్ఓల పనితీరును పరిశీలించి, అవసరమైన సూచనలు చేశారు. ప్రజల సందేహాలను అక్కడికక్కడే నివృత్తి చేస్తూ, సర్వేను వేగవంతంగా, పారదర్శకంగా పూర్తి చేయాలని సూచించారు.ఈ పర్యవేక్షణలో రెవెన్యూ సిబ్బంది, బీఎల్ఓలు, గ్రామస్థులు మరియు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



మన జనప్రగతి
తెలుగు దినపత్రిక
నిజం మా ధర్మం | వార్త మా వంతు | అభివృద్ధి మా లక్ష్యం
27 - 06 - 2026

# వేలాది భక్తులు మధ్య కోలాహలంగా పీర్ల దేవుళ్ల జలధి కార్యక్రమం



**బొమ్మనహల్ మన జనప్రగతి జూన్ 26:-** హిందూ ముస్లింలు సమైక్యంగా జరుపుకునే మతసామరస్యానికి ప్రతీకగా నిలిచే మొహరం వేడుకల్లో భాగంగా శుక్రవారం బొమ్మనహల్ మండలంలో గోవిందవాడ గ్రామంలో పీర్ల దేవుళ్ల జలధి కార్యక్రమాన్ని వేలాది భక్తులు మధ్య భక్తిశ్రద్ధలతో, కోలాహలంగా నిర్వహించారు,ఈ సందర్భంగా పీర్ల దేవుళ్ల పీర్ల దేవుళ్ళను ప్రత్యేకంగా అలంకరించి డప్పు వాయిద్యాలు, భక్తుల సంప్రదాయ కళారూపాల నడుమ ఊరేగింపుగా తీసుకెళ్లారు అనంతరం గ్రామ సమీపంలోని జలాశయం వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి పీర్ల దేవుళ్లను జలధి చేశారు,గ్రామ ప్రజలు భక్తులు మొక్కులు తీర్చుకుని పీర్ల దేవుళ్ల ఆశీర్వాదాలు పొందారు,గ్రామంలో పండుగ వాతావరణం నెలకొనగా చిన్నా,పెద్దా తేడా లేకుండా అన్ని వర్గాల ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు,గ్రామ పెద్దలు, యువకులు,మహిళలు కలిసి కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు,మొహరం పండుగ సందర్భంగా ప్రజలకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తగా బొమ్మనహల్ మండల సబ్ఇన్స్పెక్టర్ నబిరసుల్ ఆధ్వర్యంలో వారి సిబ్బంది బందోబస్తు నిర్వహించారు, ప్రజలకు ఎలాంటి అవాంతరాలు జరగకుండా గ్రామ పెద్దలు,మరి పోలీసుల అప్రమత్తతతో జలధి కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.

# పెనుకొండలో గతంలో ఎన్నడూ లేనంత అభివృద్ధి: మంత్రి సవిత



**పెనుకొండ/శ్రీసత్యసాయి మన జనప్రగతి జూన్ 26:-** పెనుకొండ నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ లేనంత అభివృద్ధి జరుగుతోందని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్. సవిత తెలిపారు. శుక్రవారం 121 మంది లబ్ధిదారులకు రూ.1.15 కోట్ల విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పెనుకొండ నియోజకవర్గానికి రూ.13.40 కోట్లకు పైగా సీఎంఆర్ఎఫ్ నిధులు మంజూరు చేశామని తెలిపారు. పేదల ఆరోగ్య రక్షణకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని, అత్యవసర వైద్య చికిత్సలకు సీఎంఆర్ఎఫ్ ఎంతో అండగా నిలుస్తోందన్నారు. నియోజకవర్గంలో సీసీ, బీటీ రోడ్లు, కాలువలు, వంతెనల నిర్మాణంతో పాటు పలు అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని చెప్పారు. సీఎం చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందని, ప్రజల్లోకి వెళ్లి ఓటు అడిగే హక్కు తమకే ఉందని మంత్రి సవిత పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# ఆటలే చివరయ్యాయి..కాలువలో పడి చిన్నారి మృతి

**● స్నేహితులతో ఆడుకుంటూ ప్రమాదం ● అభిరామ్ మృతితో కుటుంబంలో విషాదం ● లింగాలలో విషాద ఘటన**




**లింగాల మన జనప్రగతి జూన్ 26:-**వైఎస్సార్ కడప జిల్లా లింగాల మండలం చిన్నకుడాల గ్రామ సమీపంలోని లింగాల కుడి కాలువలో ప్రమాదవశాత్తు పడి ఐదేళ్ల బాలుడు మృతి చెందిన విషాద ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన అభిరామ్ (5) ఎల్‌కేజీ చదువుతున్నాడు. మొహరం పండుగ సందర్భంగా పాఠశాలకు సెలవు ఉండటంతో తన స్నేహితులతో కలిసి హరిజనవాడ సమీపంలో ప్రవహిస్తున్న లింగాల కుడి కాలువ వద్దకు వెళ్లాడు. ఈ క్రమంలో కాలువలో జారి నీటిలో కొట్టుకుపోయాడు. దీనిని గమనించిన తోటి చిన్నారులు వెంటనే బాలుడి తల్లిదండ్రులకు సమాచారం అందించారు. అభిరామ్ తండ్రి అరుణ్ కుమార్, తల్లి నాగమ్మలు సంఘటనా స్థలానికి చేరుకుని బాలుడిని బయటకు తీసి వెంటనే పులివెందుల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి అప్పటికే అభిరామ్ మృతి చెందినట్లు నిర్ధారించారు. బాలుడి మృతితో కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించగా, గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

# APAIMS 2.0తో ఎరువుల పంపిణీలో పూర్తి పారదర్శకత: మంత్రి అచ్చెన్నాయుడు



**అమరావతి మన జనప్రగతి జూన్ 26:-** రాష్ట్రంలో రైతులకు సబ్సిడీ ఎరువులను పారదర్శకంగా, సకాలంలో అందించేందుకు అమలు చేస్తున్న APAIMS 2.0 వ్యవస్థ విజయవంతంగా కొనసాగుతోందని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. జూన్ 8 నుంచి కృష్ణా, కాకినాడ జిల్లాలు మినహా రాష్ట్రవ్యాప్తంగా ఈ వ్యవస్థ ద్వారా ఇప్పటివరకు 2.97 లక్షల మంది రైతులకు 48,588 మెట్రిక్ టన్నుల యూరియా, 12,874 మెట్రిక్ టన్నుల డీఏపీ పంపిణీ చేసినట్లు వెల్లడించారు. రైతు సాగు విస్తీర్ణం, పంట అవసరాలకు అనుగుణంగానే ఎరువులు అందజేస్తున్నామని చెప్పారు. APAIMS 2.0తో ఎరువుల అక్రమ మళ్లింపులు, నిల్వదాచివేత, రైతులు కాని వారికి విక్రయాలకు పూర్తిగా అడ్డుకట్ట పడిందన్నారు. ప్రారంభంలో ఎదురైన స్వల్ప సాంకేతిక సమస్యలను అధిక భాగం పరిష్కరించామని, ప్రస్తుతం వ్యవస్థ సజావుగా పనిచేస్తోందని తెలిపారు. ఎరువుల పంపిణీపై ఎలాంటి సమస్యలు ఉన్నా టోల్ ఫ్రీ నంబర్ 155251కు ఫిర్యాదు చేయవచ్చన్నారు. టమాటా ధరలు పూర్తిగా పడిపోయాయన్న ప్రచారం కూడా వాస్తవం కాదని మంత్రి స్పష్టం చేశారు. అధికారిక మార్కెట్ గణాంకాల ప్రకారం ధరలు స్థిరంగా ఉన్నాయని పేర్కొన్నారు. అలాగే చిత్తూరు జిల్లా జైన్ మ్యాంగో పల్ప్ యూనిట్ నిలిచిపోయిందన్న ప్రచారం కూడా అసత్యమని, ప్రస్తుతం కార్యకలాపాలు కొనసాగుతున్నాయని తెలిపారు. రైతులు అధికారిక సమాచారం మాత్రమే నమ్మాలని, నిరాధార ప్రచారాలను విశ్వసించవద్దని మంత్రి అచ్చెన్నాయుడు విజ్ఞప్తి చేశారు.

# సంక్షేమం,అభివృద్ధి కూటమితోనే సాధ్యం



**వేంపల్లె మన జనప్రగతి జూన్ 26:-**రాష్ట్రము లో అభివృద్ధి సంక్షేమం సమపాళ్ళలో జరుగుతున్నదని అందుకు చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో ని కూటమి ప్రభుత్వం కే సాధ్యం అని బ్రాహ్మణ చైతన్య వేదిక రాష్ట్ర నాయకులు పీవీయెస్ వి ప్రసాదరావు సూగురు రఘునాథరావు లు ఒక ప్రకటన లో పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం లో బ్రాహ్మణులకు ఎక్కువ లబ్ది జరిగిందని ప్రస్తుతం 46000 మంది బ్రాహ్మణులకు 21కోట్ల రూపాయలు ఎన్టీఆర్ భరోసా కింద ప్రతి నెల పొందుతు న్నారని ఇది గత ప్రభుత్వంలో కంటే 20000 మంది బ్రాహ్మణులు అదనం గా లబ్ది పొందుతు న్నారని తెలిపారు. అంతే గాక 970 దేవాలయలలో బ్రాహ్మణులకు పాలక మండలి లో అవకాశం కలిగిందని పేర్కొన్నారు. ఇంకా 400దేవాలయలలో పాలక మండలి ఏర్పాటు చేయాల్సివుందని ఇంకా 400 మంది బ్రాహ్మణులకు అవకాశం కలిగే అవకాశం ఉందని అన్నారు. ఇది గాక దూపదీప నైవేద్యం కింద చిన్న దేవాలయలలో ప్రతి పూజారి కి 7000రూపాయలు బత్యం కింద 3000రూపాయలు దీపారాధన ఖర్చులు కు పొందుతు న్నారని అన్నారు. తల్లికి వందనం పథకం చాలా మంది దూపదీప నైవేద్యం కింద లబ్ది పొందుతున్న పూజారి పిల్లలకు రావాల్సి ఉందని వారి విషయం పరిశీలన లో ఉందని తెలిపారు. బ్రాహ్మణ సంక్షేమకార్పొరేషన్ బిసి శాఖ నుండి దేవాదాయ శాఖ కింద కు మార్చడం తో బ్రాహ్మణులు కు మేలు జరుగుతుందని చెప్పారు. బ్రాహ్మణులకు ఇంకా సబ్సిడీ రుణాలు మంజూరు చేయవలసి ఉందని కార్పొరేషన్ పాలక మండలి తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

# నిత్విక మృతి కేసులో దోషులు ఎంతటి వారైనా వదిలే ప్రసక్తే లేదు

**బాధితులకు అండగా కూటమి ప్రభుత్వం**

**పులివెందుల జడ్పిటిసి మారెడ్డి లతారెడ్డి,(హెచ్.ఎల్.సి) చైర్మన్ మారెడ్డి జోగిరెడ్డి**




**పులివెందుల అర్బన్ మన జనప్రగతి జూన్ 26:** లింగాల మండలం లోపట్నూతల గ్రామంలో నీళ్ల డ్రమ్‌లో పడి నాలుగేళ్ల చిన్నారి నిత్విక మృతి చెందిన ఘటన అత్యంత విచారకరమని పులివెందుల జడ్పీటీసీ మారెడ్డి లతారెడ్డి,తుంగభద్ర ప్రాజెక్టు హై లెవెల్ కెనాల్ చైర్మన్ మారెడ్డి జోగిరెడ్డి అన్నారు. శుక్రవారం పులివెందుల ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకున్న కూటమి నాయకులు నిత్విక తల్లిదండ్రులు సృజన, రామాచారిలను పరామర్శించి, వారిని ఓదార్చారు. ఈ దారుణ ఘటనకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మారెడ్డి జోగిరెడ్డి,లతారెడ్డి మీడియాతో మాట్లాడుతూ ఈ కేసులో పోలీసులు అత్యంత వేగంగా స్పందించి దర్యాప్తును ముమ్మరం చేశారని ఇప్పటికే కొందరు అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారన్నారు. విచారణలో తప్పు చేసినట్లు తేలితే,వారు ఎంతటి వారైనా సరే ప్రభుత్వం వెనకాడకుండా కఠిన చర్యలు తీసుకుంటుందన్నారు. బాధిత కుటుంబానికి పూర్తి న్యాయం జరిగేలా చూసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని దర్యాప్తు పూర్తయిన వెంటనే బాధ్యులపై చట్టప్రకారం కఠినమైన సెక్షన్ల కింద చర్యలు తీసుకుంటారని తెలిపారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించిన వారిలో లింగాల మండల టీడీపీ అధ్యక్షుడు విశ్వనాథరెడ్డి, పులివెందుల మార్కెట్ యార్డ్ చైర్మన్ గడ్డం అమర్నాథ్ యాదవ్,తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి అజ్జుగుట్టు రవితేజ రెడ్డి తదితర కూటమి నాయకులు ఉన్నారు.

# పొగాకు రైతులకు గిట్టుబాటు ధరకు ప్రభుత్వం భరోసా



**అమరావతి మన జనప్రగతి జూన్ 26:-** వర్జీనియా (FCV) పొగాకు రైతులకు ఎలాంటి నష్టం జరగకుండా కొనుగోలు ప్రక్రియను జిల్లా యంత్రాంగం నిరంతరం పర్యవేక్షించాలని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్లు, వ్యవసాయ శాఖ అధికారులతో శుక్రవారం నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో పొగాకు కొనుగోళ్లు, రైతుల సమస్యలు, ఖరీఫ్ ఎరువుల లభ్యతపై సమీక్షించారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు పొగాకు కొనుగోళ్లలో కిలోకు రూ.200 కంటే తక్కువ ధరకు కొనుగోళ్లు జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో పారదర్శకత పాటించాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన యూరియా, డీఏపీ, కాంప్లెక్స్ తదితర ఎరువులు రాష్ట్రంలో సమృద్ధిగా ఉన్నాయని, కృత్రిమ కొరత, నిల్వదాచివేత, అధిక ధరలకు విక్రయాలపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. 2026-27 పంట సంవత్సరానికి ఆంధ్రప్రదేశ్‌లో FCV పొగాకు ఉత్పత్తి లక్ష్యాన్ని సుమారు 81 మిలియన్ కిలోలుగా నిర్ణయించినట్లు పేర్కొన్నారు. రైతులకు గిట్టుబాటు ధర, సకాలంలో ఎరువుల సరఫరా అందేలా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు.

# హోటళ్లు, రెస్టారెంట్లలో గ్యాస్ కొరత కారణంగా పెంచిన ఆహార ధరలను వెంటనే తగ్గించాలి : మెట్టు శ్రీధర్ డిమాండ్



**పటాన్ చెరువు మన జనప్రగతి జూన్ 26:-** కేంద్ర ప్రభుత్వం వాణిజ్య ఎల్పీజీ సిలిండర్ల సరఫరాపై ఉన్న పరిమితులను తొలగించిన నేపథ్యంలో, హోటళ్లు మరియు రెస్టారెంట్ల టిఫిన్ సెంటర్ల యజమానులు గతంలో సిలిండర్ల కొరత, అధిక ధరల కారణంగా పెంచిన ఆహార పదార్థాల ధరలను వెంటనే తగ్గించాలని నవభారత్ నిర్మాణ్ యువసేన వ్యవస్థాపక అధ్యక్షుడు తెలంగాణ యువజన సంఘాల సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మెట్టు శ్రీధర్ డిమాండ్ చేశారు. సిలిండర్ల కొరత ఉన్న సమయంలో వినియోగదారులపై అదనపు భారం మోపుతూ టిఫిన్లు, భోజనాలు మరియు ఇతర ఆహార పదార్థాల ధరలను పెంచిన హోటళ్లు, ఇప్పుడు పరిస్థితులు సాధారణ స్థితికి చేరుకున్నప్పటికీ అదే అధిక ధరలను కొనసాగించడం సమంజసం కాదన్నారు. ప్రజల ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని హోటల్ యాజమాన్యాలు సామాజిక బాధ్యతతో వ్యవహరించి ఆహార ధరలను తగ్గించాలని కోరారు. అలాగే, రాష్ట్ర ప్రభుత్వం మరియు సంబంధిత అధికార యంత్రాంగం హోటళ్లు, రెస్టారెంట్లలో ఆహార ధరలపై పర్యవేక్షణ చేపట్టి, ప్రజలకు న్యాయమైన ధరలకు నాణ్యమైన ఆహారం అందేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని మెట్టు శ్రీధర్ విజ్ఞప్తి చేశారు.

# శ్రీ ఇరుగులమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు





**సిద్ధవటం మన జనప్రగతి జూన్ 26:-**మండలంలోని మూలపల్లి క్రాస్ సమీపంలో వెలసిన గ్రామ దేవత శ్రీ ఇరుగులమ్మ అమ్మవారికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సిద్ధవటం గ్రామానికి చెందిన గట్టుపల్లి వెంకటసుబ్బయ్య, పద్మజ దంపతుల కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకం, కుంకుమార్చన నిర్వహించి పసుపు, కుంకుమలతో అలంకరించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ ఏర్పాటు చేశారు. అమ్మవారిని దర్శించుకున్న భక్తులకు అమ్మవారి అనుగ్రహం లభిస్తుందని, వ్యాపార, ఉద్యోగ, ఆరోగ్య సమస్యలు తొలగిపోతాయని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో గట్టుపల్లి శ్రీనివాసులు, మౌనిక, రవితేజ, చైతన్య, జయకిషోర్, సాయి స్వరూప్ తదితర భక్తులు పాల్గొన్నారు.

# నూతన దంపతులను ఆశీర్వదించిన టీడీపీ నేతలు



**సిద్ధవటం మన జనప్రగతి జూన్ 26:-**మండలంలోని భాకరాపేట గ్రామంలో జరిగిన వివాహ వేడుకల్లో నూతన దంపతులు నాగరాజు నాయుడు,లోకేశ్వరిని టీడీపీ నేతలు ముత్యాల తలంబ్రాలతో ఆశీర్వదించారు. ఈ సందర్భంగా దంపతులకు అష్ట ఐశ్వర్యాలు, సుఖసంతోషాలు కలగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర దూదేకుల సంక్షేమ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ డాక్టర్ వీరభద్రులు, రాష్ట్ర బీసీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి శ్రీనివాసులు నాయుడు, సింగిల్ విండో అధ్యక్షుడు దశరథ నాయుడు, నిత్య పూజ కోన చైర్మన్ రాజేంద్రప్రసాద్, మాజీ మార్కెట్ చైర్మన్ మల్లు సంజీవరెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ బాలిరెడ్డి, టీడీపీ సీనియర్ నేత రామచంద్రయ్య, బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు చెంచయ్య నాయుడు, యువనేత తుర్ర ప్రతాప్ నాయుడు పాల్గొన్నారు.

# ఓట్ల తొలగింపుపై తప్పుడు ప్రచారాన్ని నమ్మొద్దు

**ఎన్నికల సంఘం నిబంధనల మేరకే ప్రత్యేక ఓటరు జాబితా సవరణ**

**ప్రజలకు ఉప కలెక్టర్ చల్లా కళ్యాణి సూచన**




**అన్నమయ్య జిల్లా బ్యూరో మన జనప్రగతి జూన్ 26:-** మదనపల్లె నియోజకవర్గంలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియ జూన్ 15 నుంచి ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం కొనసాగుతోందని ఉప కలెక్టర్ చల్లా కళ్యాణి తెలిపారు. ఓట్ల తొలగింపుపై సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న తప్పుడు ప్రచారాన్ని ప్రజలు నమ్మవద్దని ఆమె విజ్ఞప్తి చేశారు. ఎన్నికల సంఘం నిబంధనల మేరకే ఓటరు జాబితా సవరణ జరుగుతోందని, ఈ ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా కొనసాగుతోందని ఆమె స్పష్టం చేశారు. ప్రతి ఇంటికి బూత్ స్థాయి అధికారులు వెళ్లి అవసరమైన దరఖాస్తు పత్రాలను అందజేసి, వాటిని నింపడంలో ఓటర్లకు సహాయం చేస్తున్నారని తెలిపారు. అలాగే, ఓటర్లు ఎన్నికల సంఘం దరఖాస్తు లేదా ఓటర్ల సేవల జాలగూడు ద్వారా కూడా తమ వివరాలను నమోదు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఓటరు జాబితా సవరణకు సంబంధించిన సందేహాలు లేదా సమాచారం అవసరమైతే సంబంధిత బూత్ స్థాయి అధికారులను లేదా ఉప కలెక్టర్ కార్యాలయాన్ని సంప్రదించాలని ఉప కలెక్టర్ చల్లా కళ్యాణి సూచించారు.

మన జనప్రగతి
తెలుగు దినపత్రిక
నిజం మా ధర్మం | వార్త మా వంతు | అభివృద్ధి మా లక్ష్యం
27 - 06 - 2026

## చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండండి

### - కడప వన్ టౌన్ సి.ఐ ఎం. తిమ్మారెడ్డి



**కడప టౌన్ మన జనప్రగతి జూన్ 26:-** జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు నేరనియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా కడప వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లకు , నేరచరిత్ర గలవారికి వన్ టౌన్ పోలీస్ స్టేషన్ లో కడప వన్ టౌన్ సి.ఐ ఎం. తిమ్మారెడ్డి శుక్రవారం సాయంత్రం కౌన్సిలింగ్ నిర్వహించారు. సత్ప్రవర్తనతో జీవించాలని, నేర ప్రవృత్తికి స్వస్తి పలకాలని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలలో పాల్గొంటే తప్పనిసరిగా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని కడప వన్ టౌన్ సి.ఐ ఎం. తిమ్మారెడ్డి వార్నింగ్ ఇవ్వడం జరిగింది.

## ప్రభుత్వ పాఠశాల మూసివేతపై మాలమహానాడు ఆవేదన






**పీలేరు మన జనప్రగతి జూన్ 26 :-** పీలేరు మండలం దొడ్డిపల్లి పంచాయతీ పరిధిలోని కొత్తపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను అధికారులు మూసివేయడంపై మాలమహానాడు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఆప్పటి తెలుగుదేశం పార్టీ ప్రభుత్వ హయాంలో (08.10.1998)శాసనసభ్యులు జీ.వి. శ్రీనాథ రెడ్డిచే మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ప్రారంభించారు కొత్త పల్లి,చుట్టు పక్కల ప్రాంతాల విద్యార్థులకు విద్యానందించి నేడు ఎంతో మందిని ప్రభుత్వ ఉద్యోగులుగా, మేధావులుగా, తీర్చి దిద్దిన పాఠశాల ఈరోజు కార్పొరేట్, ప్రైవేట్, విద్యా సంస్థలకు దీటుగా పాఠశాల నిర్వహించలేక మూసివేయడం ఎంతో బాధించదగ్గ విషయమని దీనిని ఆసరాగా తీసుకోని కొంతమంది బడాబాబులు ఆ పాఠశాల గదులను తమ వ్యక్తి గత గోడౌన్లుగా ఉపయోగించుకుంటున్నారని పాఠశాలను అనధికారంగా ఉపయోగిస్తున్నారని పాఠశాల పర్యవేక్షణపై చర వాణి ద్వారా మండల విద్యాశాఖ అధికారులను,యం. పి. డి. ఓ.ను, గ్రామ సచివాలయ సెక్రటరీని వివరణ కోరగా పొంతన లేని సమాదానాలు తెలిపారని దీనిపై జిల్లా ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకువాలని డిమాండ్ చేశారు.

## గ్యాస్ కనెక్షన్ లేని వారికి తక్షణం గ్యాస్ కనెక్షన్

### - శ్రీ ప్రభాకర్ ఇండియన్ గ్యాస్ డిస్ట్రిబ్యూటర్ సివి సుబ్బారెడ్డి



**రామాపురం మన జనప్రగతి జూన్ 26:-** ఇంతవరకు గ్యాస్ కనెక్షన్ లేనివారికి గ్యాస్ కనెక్షన్ కావాలంటే తక్షణం గ్యాస్ కనెక్షన్ ఇవ్వబడునని శ్రీ ప్రభాకర్ ఇండియన్ గ్యాస్ డిస్ట్రిబ్యూటర్ సి వి సుబ్బారెడ్డి తెలిపారు. ప్రధానమంత్రి ఉజ్వల యోజన పథకంటూవీఖ్ ఊకింద గ్యాస్ కనెక్షన్ పొందిన వారు ప్రతి సంవత్సరం ఈ కేవైసీ తప్పనిసరిగా చేయి ంచుకోవాలని,దీపంఎ డిపాజిట్ కనెక్షన్ ఉన్నవారు రెండు సంవత్సరాలకు ఒకసారి ఈ కేవైసీ చేయించుకోవాలని హాస్టల్స్ మరియు అంగనవాడి కనెక్షన్లు ఉన్న ప్రతి స్కూలు కమర్షియల్ సురక్ష రబ్బర్ ట్యూబ్. ప్రతి సంవత్సరం మార్చాలనీప్రతి ఊరికి గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ ఆటోలు వస్తున్నాయి కాబట్టి డెలివరీ బాయ్ సిబ్బందిని సంప్రదించాలని.కార్యాలయం ఉదయము 10 గంటల నుంచి సాయంత్రం 05 గంటల వరకు ఉంటుందని కనెక్షన్ కోసం వచ్చేవారు ఆధార్ కార్డ్ రేషన్ కార్డ్ బ్యాంక్ అకౌంట్ ఫోటోలు తీసుకునే రావాలని కోరారు కావలసినవారు క్రింది నెంబర్ సంప్రదించండనీ రామాపురం మండలం వీరబల్లి మండలం. :- 94402 71643. వీరబల్లి మండలం వారు కూడా సంప్రదించవచ్చని తెలిపారు

## ఎస్ఐఆర్ పనుల్లో 75 శాతం పూర్తి అపోహలు నమ్మొద్దు: ఆర్డీఓ నారాయణరెడ్డి



**పీలేరు మన జనప్రగతి జూన్ 26:-**పీలేరు తహసీల్దార్ కార్యాలయ పరిధిలో చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్.ఐ.ఆర్) కార్యక్రమంలో ఇప్పటివరకు 75 శాతం పనులు పూర్తయ్యాయని, మిగిలిన 25 శాతం పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేస్తామని పీలేరు ఆర్డీఓ, స్పెషల్ ఆఫీసర్ నారాయణరెడ్డి తెలిపారు.శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ శివకుమార్‌తో కలిసి ఎస్ఐఆర్ కార్యక్రమం పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను పూర్తిస్థాయి పారదర్శకతతో, ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా నిర్వహిస్తున్నామని చెప్పారు.ఎస్ఐఆర్ కార్యక్రమంపై కొందరు చేస్తున్న తప్పుడు ప్రచారాలు, అపోహలను ప్రజలు నమ్మవద్దని ఆయన సూచించారు. ఓటర్ల జాబితా సవరణలో భాగంగా ఇంటింటికి వచ్చే బూత్ లెవల్ అధికారులు (బీఎల్ఓలు)కు అవసరమైన వివరాలు అందించి ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.మిగిలిన 25 శాతం పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేసి, అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో సక్రమంగా నమోదు అయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజల సహకారంతో ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేస్తామని ఆర్డీఓ నారాయణరెడ్డి పేర్కొన్నారు.

## భవన నిర్మాణ కార్మికులకు కోటి విరాళం ఏమైంది..: ఏఐటీయూసీ


**● జూలై 3న రాష్ట్రవ్యాప్తంగా ధర్నాలు ● జూన్ 30న 'చలో విజయవాడ'కు మద్దతు**




**కాకినాడ మన జనప్రగతి జూన్ 26:-**కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్. వెంకట సుబ్బయ్య తెలిపారు. ఎన్నికల సమయంలో భవన నిర్మాణ కార్మికులకు వ్యక్తిగతంగా కోటి రూపాయల విరాళం ఇస్తానని ప్రకటించిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆ హామీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.కాకినాడలోని పీఆర్ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల హక్కులను దెబ్బతీసే విధానాలను అవలంబిస్తున్నాయని విమర్శించారు. విశాఖ ఉక్కు కర్మాగారంలో ఇటీవల జరిగిన ప్రమాదంలో మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు కోటి రూపాయల చొప్పున పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.కార్మికుల సమస్యల పరిష్కారం, కార్మిక వ్యతిరేక విధానాల నిరసనగా జూలై 3న రాష్ట్రవ్యాప్తంగా అన్ని కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ధర్నాలు నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ధరల పెరుగుదల, నిరుద్యోగం, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణపై కేంద్ర ప్రభుత్వ విధానాలను ఆయన తీవ్రంగా విమర్శించారు. రాజ్యాంగం, ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ కోసం ప్రజలు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు.ఆర్టీసీ సేవలను ప్రైవేటీకరించే ప్రయత్నాలను విరమించుకోవాలని, ప్రభుత్వ ఆస్తులను కార్పొరేట్ సంస్థలకు అప్పగించే చర్యలను నిలిపివేయాలని కోరారు. నాలుగు కార్మిక చట్టాలను రద్దు చేసే వరకు ఉద్యమం కొనసాగుతుందని స్పష్టం చేశారు.ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాటిపాక మధు మాట్లాడుతూ, రైతాంగ సమస్యల పరిష్కారం, పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేస్తూ జూన్ 30న నిర్వహించే 'చలో విజయవాడ' కార్యక్రమానికి రైతులు, కార్మికులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్, జిల్లా అధ్యక్షుడు కసింకోట కిషోర్ కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ బొబ్బిలి శ్రీనివాసరావు, సీనియర్ కార్మిక నాయకుడు కె. ఆదినారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## మేడలైన్ వంతెన నిర్మాణంపై శ్వేతపత్రం విడుదల చేయాలి: రమణరాజు

**ఆ వంతెన అక్రమ నిర్మాణమా సక్రమ నిర్మాణమా అనేది తెలియజేయాలి**




కాకినాడ మన జనప్రగతి జూన్ 26:- కాకినాడ ఉప్పుటేరులో ఇంద్రపాలెం వంతెన సమీపంలో నిర్మాణం పూర్తిచేసుకుని ప్రారంభానికి సిద్ధంగా ఉన్న మేడలైన్ ప్రైవేట్ వంతెన నిర్మాణంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శ్వేతపత్రం విడుదల చేయాలని పౌర సంక్షేమ సంఘం కన్వీనర్, సామాజిక వేత్త దూసర్లపూడి రమణరాజు డిమాండ్ చేశారు. కలెక్టరేట్ రోడ్డులో అంబేద్కర్ విగ్రహం వద్ద శుక్రవారం ఫ్లెక్స్ ప్రదర్శిస్తూ ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ వంతెన నిర్మాణం చట్టబద్ధంగా జరిగిందా, లేక అక్రమంగా చేపట్టారా అనే విషయాన్ని ప్రభుత్వం ప్రజలకు స్పష్టం చేయాలని కోరారు. కేంద్ర జల సంఘం నిబంధనలను ఉల్లంఘించి, గత ప్రభుత్వాల హయాంలో రాజకీయ పలుకుబడితో నిర్మాణం జరిగిందని ఆరోపించారు. భూ రికార్డుల్లో అక్రమ మార్పులు చేసి నిర్మాణానికి సహకరించారని పేర్కొన్నారు. దీనిపై న్యాయ విచారణ జరిపితే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని అన్నారు.వంతెన ప్రారంభమైతే ఇప్పటికే తీవ్ర రద్దీ ఉన్న ఆరు రోడ్ల కూడలిలో ట్రాఫిక్ సమస్యలు, ప్రమాదాలు మరింత పెరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. నగరంలో వరద ముంపు సమస్యలకు కూడా ఈ వంతెన ఒక కారణంగా మారుతుందని ఆరోపించారు. మేడలైన్ ప్రాంతంలోని ప్రభుత్వ భూములను ప్రజా ప్రయోజనాల కోసం వినియోగించాలని, పేదల గృహాలు, తీరప్రాంత కార్మికుల నివాసాలు, జర్నలిస్టుల కాలనీ వంటి అవసరాలకు కేటాయించాలని సూచించారు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, ప్రజాప్రతినిధులు ఈ అంశంపై ప్రజలకు వివరణ ఇవ్వాలని, వంతెన నిర్మాణానికి సంబంధించిన పూర్తి వివరాలతో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

## కులాల మధ్య చిచ్చు పెట్టడమే జగన్ లక్ష్యం: మాజీ ఎమ్మెల్యే వర్మ

**● కాపులకు మేలు చేసింది చంద్రబాబు ప్రభుత్వమేనని వ్యాఖ్య ● రాష్ట్రంలో శాంతి భద్రతలకు భంగం కలిగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపణ**



**కాకినాడ మన జనప్రగతి జూన్ 26:-**ప్రశాంతంగా ఉన్న రాష్ట్రంలో కులాల మధ్య విభేదాలు సృష్టించి రాజకీయ లబ్ధి పొందడమే మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి లక్ష్యమని మాజీ ఎమ్మెల్యే ఎస్‌వీఎస్ఎన్ వర్మ ఆరోపించారు. కూటమి ప్రభుత్వం స్థిరంగా కొనసాగుతుందనే అసహనంతో రాష్ట్రంలో అలజడి సృష్టించేందుకు వైసీపీ నాయకులు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు.వర్మ మాట్లాడుతూ..కాపు సామాజిక వర్గానికి నిజమైన ప్రయోజనం కల్పించిన ప్రభుత్వం చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని ప్రభుత్వమేనని అన్నారు. రాష్ట్ర అభివృద్ధిని చూసి ఓర్వలేక ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. కృష్ణలంకలో జరిగిన సాయికృష్ణ ఘటనపై జగన్ స్పందించిన తీరు అనుమానాలకు తావిస్తోందని, దీనిపై ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఏర్పాటు చేసిందని, త్వరలో నిజాలు వెలుగులోకి వస్తాయని అన్నారు.రాష్ట్రంలో ఎవరికి కష్టం వచ్చినా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అండగా నిలుస్తున్నారని, అయితే వైసీపీ నాయకులు మాత్రం కుల రాజకీయాలను ప్రోత్సహిస్తున్నారని విమర్శించారు. రాష్ట్రం అంటే ఒక్క కులం కాదని, అన్ని వర్గాల ప్రజల సమాహారమని గుర్తుంచుకోవాలని జగన్‌కు సూచించారు.మాజీ ఎమ్మెల్యే వంగ గీత తనపై చేసిన వ్యాఖ్యలకు స్పందిస్తూ, తాను ఈ నేలలో పుట్టి ఈ నేలలోనే కలిసిపోతానని చెప్పారు. అలాగే 20192024 మధ్య జరిగిన తప్పులను సరిదిద్దడమే "రెడ్‌బుక్" ఉద్దేశమని, దానిని తప్పుగా ప్రచారం చేయడం సరికాదన్నారు.ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రానికి ఎలాంటి అన్యాయం జరగదని, అన్ని వర్గాలకు సమాన న్యాయం జరుగుతుందని వర్మ విశ్వాసం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో సఖుమళ్ల గంగాధరరావు, బొజ్జ సతీష్, దేవరపల్లి రామారావు, అడ్డగళ్ల శివ తదితరులు పాల్గొన్నారు.

## విద్యాభివృద్ధికి రెడ్ కాన్వెంట్ పూర్వ విద్యార్థులు 3.50 లక్షల విలువైన ఆర్థిక సహాయం పంపిణీ




**కాకినాడ మన జనప్రగతి జూన్ 26:-** పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి, సామాజిక సేవకు రెడ్ కాన్వెంట్ పూర్వ విద్యార్థులు అందిస్తున్న సహకారం అభినందనీయమని రెడ్ కాన్వెంట్ స్టూడెంట్స్ (1978) ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ బచ్చు కమల్ బాబు పేర్కొన్నారు. శుక్రవారం ఎన్ ఎఫ్సిఎల్ రోడ్డులోని ట్రస్ట్ కార్యాలయంలో నిర్వహించిన సేవా కార్యక్రమంలో మొత్తం 10 మంది లబ్ధిదారులకు మూడు లక్షల ఏభై వేల రూపాయలు విలువైన విద్యార్థి వేతనాలు, సాయాన్ని ఆయన చేతుల మీదుగా అందజేశారు. హెచ్‌బీబీ చదువుతున్న ఒకరికి, ఇంజనీరింగ్ చదువుతున్న ఒక విద్యార్థికి, నలుగురు ఇంటర్ విద్యార్థులకు, ఇద్దరు డిగ్రీ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేశారు. ఒక విద్యార్థికి చదువు నిమిత్తం లాప్‌టాప్ పంపిణీ చేశారు.దివ్యాంగులకు, వినికిడి సమస్యతో బాధపడుతున్న ఒకరికి రెండు వినికిడి యంత్రాలు, మరో విద్యార్థికి సైకిల్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ బచ్చు కమలబాబు మాట్లాడుతూ 48 సంవత్సరాల క్రితం (1978లో) పదో తరగతి కలిసి చదువుకున్న స్నేహితులంతా ఒకటై, 9 ఏళ్ల క్రితం ఈ ఛారిటబుల్ ట్రస్ట్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ ట్రస్ట్ ద్వారా ఇప్పటివరకు వేలాది సేవా కార్యక్రమాలు నిర్వహించామని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బాదం బాలకృష్ణ, ఎ కళ్యాణి, డివిఆర్ జగన్నాథరావు, పి పాపారావు, వి మధు, టి పద్మనాభం, వి రామచంద్ర, ఎన్ బంగారురాజు, బోడా ఆనంద్, శ్రీలత, సుజాత తదితర పూర్వ విద్యార్థులు, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

## జూన్ 30న విజయవాడ సియం రాయభార కార్యక్రమం ను జయప్రదం చేయండి!: ఎపి రైతు సంఘం పిలుపు



**పీలేరు మన జనప్రగతి జూన్ 26 :-** రైతులకు రు 2 లక్షల వరకు రుణమాఫీ చేయాలని,, డా. స్వామినాధన్ కమీషన్ సిపార్సుల మేరకు అన్ని రకాల పంటలకు గిట్టుబాటు కల్పించాలని డిమాండ్ తో ఈనెల 30 తేదీన రైతు సంఘం ఆధ్వర్యంలో విజయవాడలో సియం తో జరిపే రాయభార కార్యక్రమంను జయప్రదం చేయాలని ఎపి రైతు సంఘం పిలుపిచ్చింది..ఈ మేరకు పీలేరు లో రైతు సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర నేత డా. టి. జనార్దన్, అన్నమయ్య జిల్లా ఎపి రైతు సంఘం సహాయ కార్యదర్శి,,టి. ఎల్ వెంకటేష్,పీలేరు కార్యదర్శి పరదేశి రెడ్డి లతో కలసి ఛలో విజయవాడ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జనార్దన్ మాట్లాడుతూ రైతులు,, కౌలు రైతులు రుణ భారం నుండి విముక్తి కావడానికి తెలంగాణా తరహాలో రు..2 లక్షల వరకు రుణాలు మాఫీ చేయాలని పేర్కొన్నారు... రాష్ట్ర ప్రభుత్వం రాయలసీమ ఉధ్యాన హబ్ ప్రకటనకే పరిమితమయిందని , నేడు, మామిడి,, బొప్పాయి,, అరటి,, ఉల్లి, నిమ్మ రైతులు గిట్టుబాటు ధర కోసం ప్రతి ఏటా రోడ్డెక్కే స్థితి కల్పించబడుతోందని తెలిపారు. అన్నదాత కు ఆదుకొనేందుకు 50 సంవత్సరాలు పైబడిన రైతులకు రు. 10 వేలు పెన్షన్ చెల్లించాలని కోరారు.. పంటల బీమా పథకం అన్ని పంటలకు అమలు చేసి ప్రభుత్వమే ప్రీమియం చెల్లించాలని డిమాండ్ చేశారు. అన్నమయ్య జిల్లా లో కూడా మామిడి రైతులకు రు 4 సబ్సిడీ అందజేయాలని ఫ్యాక్టరీ యజమాన్యం, అక్రమాలు కట్టడి చేసి ప్రభుత్వ కఠినంగా వ్యవహరించాలని పేర్కొన్నారు..టమాటా కు కనీస మద్దతు ధర కిలో 25 రు.. చెల్లించాలని,, పీలేరు మదనపల్లె లలో ప్రభుత్వమే పల్ప్, జ్యూస్ ఫ్యాక్టరీ లు,, కోల్డ్ స్టోరేజ్ లు నెలకొల్పాలని డిమాండ్ చేశారు. రైతులు జూన్ 30 న రైతు సంఘం చేపట్టే ఛలో విజయవాడ కు పెద్దసంఖ్యలో తరలి రావాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా కార్యదర్శి యం. సాంబ,ఎఐటియుసి రాష్ట్ర సమితి సభ్యురాలు. పి. కవిత., తదితరులు పాల్గొన్నారు.

# త్యాగానికి ప్రతీక మోహరం...

## గంధపు పీర్లకు ప్రత్యేక పూజలు నిర్వహించిన శ్రీకాంత్ రెడ్డి,దేవనాధ రెడ్డి





**అన్నమయ్య జిల్లా బ్యూరో మన జన ప్రగతి జూన్ 26:-** త్యాగానికి,మత సాకరస్యానికి ప్రతీకగా మోహరం నిలుస్తుందని వైఎస్ఆర్ సిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి అన్నారు. మోహర్రం సందర్భంగా గురువారం చిన్నమండెం కస్పాలో జెడ్ పి మాజీ వైస్ చైర్మన్ దేవనాధ రెడ్డితో కలసి శ్రీకాంత్ రెడ్డి గంధపు పీర్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురువులు శ్రీకాంత్ రెడ్డి, దేవనాధ రెడ్డి లను ఆశీర్వదించి సత్కరించి ప్రసాదాలు అందచేశారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ ధర్మ పరిరక్షణ, శాంతియుత సమాజ స్థాపన కోసం మ్మహమ్మద్ ప్రవక్త మనువడు హజ్రత్ ఇమామ్ హుసేన్ చేసిన ప్రాణ త్యాగం మానవాళికి దివ్య సందేశాన్ని అందిస్తోందన్నారు. సమాజ శ్రేయస్సు కోసం పాటుపడిన ఇమామ్ జీవితం వర్తమాన సమాజానికి ఆదర్శప్రాయమన్నారు. జెడ్ పి మాజీ వైస్ చైర్మన్ దేవనాధ రెడ్డి మాట్లాడుతూ ధర్మ పరిరక్షణ, మానవ సేవ , త్యాగం వంటి మహత్తర సందేశాలను మోహరం గుర్తు చేస్తుందన్నారు. ప్రజలందరూ సుఖ సంతోషాలుతో విరజిల్లాలని,వర్షాలు సంవృద్ధిగా కురిసి పంట పొలాలుతో సశ్యశ్యామలంగా ఉండాలని శ్రీకాంత్ రెడ్డి, దేవనాధ రెడ్డి లు ఆకాక్షిస్తూ, మోహర్రం శుభాకాంక్షలు తెలిపారు. **ఘన స్వాగతం...ఆత్మీయ మమేకం...**మోహరం నకు విచ్చేసిన శ్రీకాంత్ రెడ్డి, దేవనాధ రెడ్డి,గోవర్ధన్ రెడ్డి తదితర నాయకులకు ప్రజలు,భక్తులు ఘన స్వాగతం పలికారు. మోహరంలో పాల్గొన్న భక్తులతో వారు ఆత్మీయంగా మమేకమయ్యారు. బాషికం అందించిన చాను వాళ్ళ నివాసానికి శ్రీకాంత్ రెడ్డి ,దేవనాధ రెడ్డి లువెళ్లి శుభాకాంక్షలు తెలిపారు. మండల కన్వీనర్ గోవర్ధన్ రెడ్డి, బాబు రెడ్డి,చిన్న మండెం వైస్ ఎంపిపి ఎజాస్ అలీఖాన్, మాజీ సర్పంచ్ లు నజీర్, మాజీ సర్పంచ్ సలీం,ంషె సెల్ జిల్లా అధ్యక్షుడు చుక్క అంజనప్ప,జహిర్ ఖాన్, బురాన్ ఖాన్,యేహియా ఖాన్,షుగతుళ్ళ, సజాద్,రహంతుల్లా, యేహియా ఖాన్, ,సున్నా, ఆదాముఖాన్,జహీర్, సాదిక్, శేషారెడ్డి, పెద్దిరెడ్డి, జయశంకర్ రెడ్డి, నారాయణప్ప, ఆంజనేయులు, శ్రీనాధ , నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

# రానా వడ్డిపల్లి వద్ద ఘోర రోడ్డు ప్రమాదం..ముగ్గురు మృతి


- ఎమ్మెల్యే కిషోర్ దిగ్భ్రాంతి
- క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలి, బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుంది: ఎమ్మెల్యే



**పీలేరు మన జనప్రగతి జూన్ 26 :-** పీలేరు మండలం రాణా వడ్డిపల్లి సమీపంలో గురువారం అర్ధరాత్రి జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి చెందడం అత్యంత బాధాకరమని పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పీలేరు మండలం రేగల్లు గ్రామానికి చెందిన 8 మంది మొహరం పండుగ చూసేందుకు కలికిరి మండలం దూరేకులవారి పల్లికి వెళ్లి తిరిగి వస్తుండగా రాణా వడ్డిపల్లి వద్ద వీరు ప్రయాణిస్తున్న ఆటోను కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కిషోర్ కుమార్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యారు. శుక్రవారం ఉదయం పీలేరు ప్రభుత్వాసుపత్రికి చేరుకున్న ఆయన మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. “ఈ ప్రమాదంలో ముగ్గురు మృతి చెందడం చాలా బాధాకరం. వారి ఆత్మకు శాంతి చేకూరాలి. బాధిత కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుంది. తీవ్రంగా గాయపడిన ఐదుగురు త్వరగా కోలుకోవాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నా నని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఆటో డ్రైవర్ ముబారక్ 55 మెహరున్ బి 70 నౌహిర్ 19 ముగ్గురు మృతి చెందగా, ఇర్ఫాని, ఆసిఫ్, వాహీద్, అఫ్జల్, సోహెబ్ ఐదు మందికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యాధికారులను ఆదేశించారు. మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఆయనతో పాటు కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొని మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు

# చిన్నశేష వాహనంపై వేణుగోపాలస్వామి అలంకారంలో ప్రసన్న వేంకటేశ్వరస్వామి

## - అప్పలాయగుంట బ్రహ్మోత్సవాల్లో రెండో రోజు ఆధ్యాత్మిక వైభవం



**తిరుపతి బ్యూరో మన జనప్రగతి జూన్ 26 :-** అప్పలాయగుంటలోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో రెండో రోజైన శుక్రవారం ఉదయం స్వామివారు ఐదు తలల చిన్నశేష వాహనంపై వేణుగోపాలస్వామి అలంకారంలో దివ్య మంగళ దర్శనం ప్రసాదించి భక్తులను అనుగ్రహించారు. **పంచభూతాలకు ప్రతీకగా చిన్నశేష వాహనం** చిన్నశేష వాహనం శ్రీవారి వ్యక్తరూపమైన పంచభౌతిక ప్రకృతికి ప్రతీకగా భావిస్తారు. పంచశిరస్సులతో కూడిన చిన్నశేషునిపై స్వామివారిని దర్శించడం ద్వారా భక్తులకు సర్వశుభాలు, ఐశ్వర్యం, ఆధ్యాత్మిక పురోగతి కలుగుతాయని ఆగమ, పురాణాలు పేర్కొంటున్నాయి. ఈ వాహనసేవలో ఆలయ ఏఈవో దేవరాజులు, ఏవీఎస్వో రాధాకృష్ణ, సూపరింటెండెంట్ శ్రీవాణి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్, అర్చకులు, శ్రీవారి సేవకులు, భక్తులు పాల్గొన్నారు.



# నూతన సిఐని కలిసిన ఆపస్ నాయకులు“



**పీలేరు మన జనప్రగతి జూన్ 26 :-** పీలేరు పట్టణ నూతన సర్కిల్ ఇన్స్పెక్టర్(CI)గా నియమతులై బాధ్యతలు చేపట్టిన గౌరవ జి. వెంకటేశ్వర్లు గారిని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) సహాధ్యక్షులు పచ్చార్ల సుధాకర్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా పాఠశాలల్లో విద్యార్థుల ప్రవర్తన తీరు గురించి సిఐ గారు ఆరా తీయడం జరిగింది. అదేవిధంగా ఎవరైనా విద్యార్థులు మత్తు పదార్థాలు మరియు గంజాయికి అలవాటుపడినట్టు మీకు అనుమానం వస్తే మా దృష్టికి తేవాలన్నారు. అలాగే విద్యార్థుల తల్లిదండ్రులకు తెలియజేయాలని అదేవిధంగా మా దృష్టికి తెస్తే కౌన్సిలింగ్ ద్వారా వారిని మామూలు స్థితికి తేవడానికి ప్రయత్నిస్తామని తెలిపారు. పాఠశాలల్లో ఇంకేమైనా సమస్యలు ఉంటే మాకు తెలపాలన్నారు. అదే విధంగా పీలేరు మండల విద్యాశాఖ అధికారి1 గా నియమతులైన గౌరవ బాబు నాయక్ గారిని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం(ఆపస్) నాయకులు మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. వారితో జిల్లా సహాధ్యక్షులు పచ్చార్ల సుధాకర్ మాట్లాడుతూ విద్యా రంగ సమస్యల పట్ల చర్యలు తీసుకోవాలని, ఉపాధ్యాయుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆపస్ పీలేరు మండల అధ్యక్షుడు ఓబుల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి జైపాల్ రెడ్డి, కె.వి పల్లి మండల ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్, వెంకటేశ్వర్లు, దివాకర్, చాంద్ బాషా, రవితేజ, భాను తదితరులు పాల్గొన్నారు.

# మాధవరం-1లో ఘనంగా హిందూ సామ్రాజ్య దినోత్సవ వేడుకలు

## శివాజీ చరిత్రను, హిందూ సామ్రాజ్య నిర్మాణంలో వీరుల సేవలను వివరించిన వక్తలు




**సిద్దవటం, మన జనప్రగతి, జూన్ 26:-** మండలంలోని మాధవరం-1 గ్రామంలో హిందూ సామ్రాజ్య దినోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని శ్రీ భద్రావతి భావనారాయణ సమేత సీతారాముల ఆలయంలో హిందూ బంధువులు సమావేశమై ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వక్త లక్ష్మీ నారాయణ రెడ్డి, ఖండ కార్యవాహక్ పి. వేణుగోపాల రాజు పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు ఛత్రపతి శివాజీ మహారాజ్ చరిత్రను, హిందూ సామ్రాజ్య స్థాపనకు ఆయన చేసిన కృషిని వివరించారు. అలాగే హిందూ ధర్మ పరిరక్షణ కోసం పాటుపడిన మహనీయుల సేవలు, వారి త్యాగాలను గుర్తు చేశారు. ప్రస్తుత తరానికి హిందుత్వ విలువలు, సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు. యువత, ముఖ్యంగా ఆడపిల్లలు పలు సామాజిక అంశాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గ్రామాల్లో ఎవరైనా మత మార్పిడులకు పాల్పడితే వాటిని అడ్డుకునేందుకు ప్రజలు చైతన్యంతో వ్యవహరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సేవా ప్రముఖ్ గంగాధర్, సుబ్బారెడ్డి, రమణారెడ్డి తదితర స్వయం సేవకులు పాల్గొన్నారు. కార్యక్రమం భక్తిశ్రద్ధలతో, ఉత్సాహంగా కొనసాగింది.

# ప్రకాశ్ నగర్‌లో రోడ్డు భద్రత, సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం



**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి జూన్ 26:-** జిల్లా ఎస్పి షెల్కె నచికేత్ విశ్వనాథ్ ఐపీఎస్ ఆదేశాల మేరకు శుక్రవారం సాయంత్రం ప్రొద్దుటూరు టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రకాష్ నగర్‌లో రోడ్డు భద్రత, సైబర్ నేరాల నివారణపై అవగాహన కార్యక్రమాన్ని టూ టౌన్ ఎస్ఐ రాఘవేంద్ర రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ రాఘవేంద్ర రెడ్డి మాట్లాడుతూ వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. నాలుగు చక్రాల వాహనాల్లో ప్రయాణించే వారు సీట్‌బెల్ట్ ధరించాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ఉపయోగించాలని తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడపకూడదని, డ్రైవింగ్ చేస్తున్న సమయంలో సెల్‌ఫోన్ వినియోగించడం ప్రమాదాలకు దారితీస్తుందని హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాల వల్ల కుటుంబాలు ఆర్థికంగా, మానసికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించి రోడ్డు ప్రమాదాల నియంత్రణకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే సైబర్ నేరగాళ్ల మోసాలకు గురికాకుండా అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద కాల్స్, లింకులు, ఓటీపీలు ఎవరికీ వెల్లడించవద్దని ప్రజలకు సూచించారు.

# పులివెందుల నియోజకవర్గ ఓటర్లకు నేడు,ఎల్లుండి ప్రత్యేక అవగాహన సదస్సులు



**పులివెందుల అర్బన్ మన జనప్రగతి జూన్ 26:-**పులివెందుల అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని ఓటర్ల సందేహాల నివృత్తి,ఫారాల భర్తీ ప్రక్రియ కోసం శని,ఆదివారాల్లో ప్రత్యేక సదస్సులు నిర్వహించనున్నట్లు ఓటర్ల నమోదు అధికారి నజీర్ అహమ్మద్ మరియు రెవిన్యూ డివిజనల్ అధికారి చిన్నయ్య ఒక ప్రకటనలో తెలిపారు. వైఎస్ఆర్ కడప జిల్లా ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ (యస్.ఐ.ఆర్ - స్పెషల్ ఇంటెన్షివ్ రెవిజన్ ) కార్యక్రమంలో భాగంగా ఈ ఏర్పాట్లు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.నేడు మరియు జూన్ 28 (ఆదివారం), 2026ఉదయం 11:00 గంటల నుండిసదస్సులు మున్సిపల్ కార్యాలయ మీటింగ్ హాల్,పులివెందుల,ఆర్డీఓ కార్యాలయ సభా భవనం, పులివెందుల,పులివెందుల ఎంపీడీవో కార్యాలయంతో పాటు నియోజకవర్గ పరిధిలోని అన్ని తహసీల్దార్ కార్యాలయాలు,ఎంపీడీఓ కార్యాలయాలలో నిర్వహిస్తారని తెలిపారు. ఓటర్ల జాబితా సవరణ,కొత్త ఓటర్ల నమోదు,మార్పులు-చేర్పులపై ఎలాంటి సందేహాలు ఉన్నా నివృత్తి చేసుకునేందుకు,సంబంధిత ఫారాలను పూర్తి చేసేందుకు ఈ సదస్సులు ఉపయోగపడతాయని ఆర్డీఓ తెలిపారు. నియోజకవర్గంలోని ఓటర్లందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు బెల్లం లోకనాథ రెడ్డి దశదిన ఖర్మలో పాల్గొన్న శ్రీకాంత్ రెడ్డి



**చక్రాయపేట మన జన ప్రగతి జూన్ 26 :-** చక్రాయపేట మండలం చీలేకంపల్లె గ్రామంలో శుక్రవారం నిర్వహించిన విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు బెల్లం లోకనాథ రెడ్డి దశదిన ఖర్మ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు. అనంతరం బెల్లం లోకనాథ రెడ్డి సమాధి వద్ద పూలమాల వేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం చీలేకంపల్లె గ్రామ ప్రజలు,నాయకులతో శ్రీకాంత్ రెడ్డి ఆత్మీయంగా మమేకమయ్యారు.

# తాగునీటి సమస్యకు పరిష్కారం చూపండి


## జడ్పీటీసీకి వినతిపత్రం సమర్పించిన తాండా వాసులు



**వేంపల్లె మన జనప్రగతి జూన్ 26:-** మండలం లోని నేలవరం తాండా లో ఉన్న తాగు నీటి కష్టాలను తీర్చాలని నేలవరం తాండా వాసులు కోరారు. శుక్రవారం వేంపల్లె లో ఉన్న జడ్పీటీసీ రవి కుమార్ రెడ్డి ని నేరవరం తాండ ప్రజలు కలిసి తాగు నీటి ఇబ్బందులపై వినతి పత్రం అందజేశారు. గత 10 రోజులుగా తాండా ప్రాంతంలో నీటి సరఫరా కాక పోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆయన దృష్టికి తెచ్చారు.. బోరులో భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో గత 10 రోజులుగా తాగునీరు రావడం లేదన్నారు. తాండా లో తీవ్ర తాగునీటి ఎద్దడి ఉన్నట్లు తెలిపారు. పది రోజులుగా చుక్కనీరు లేక అల్లాడుతున్నట్లు నేలవరం తండా వాసులు వాపోయారు. బిందెడు నీటి కోసం కిలోమీటర్ల మేర పోతున్నట్లు తెలిపారు. అధికారుల నిర్లక్ష్యంపై జడ్పీటీసీ వద్ద ప్రజల ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్యను పలుమార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోలేదని తెలిపారు. వెంటనే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి, సంబంధిత అధికారులతో మాట్లాడాలని వేంపల్లి జెడ్పీటీసీ మాచిరెడ్డి రవికుమార్ రెడ్డికి తండా ప్రజలు కోరారు. నేలవరం తండాపై అధికారుల సవతి తల్లి ప్రేమ కురిపిస్తున్నట్లు చెప్పారు.

# ఆపదలోని పేదల పాలిట ఆపద్బాంధవులు నల్లారి బ్రదర్స్

## - టిడిపి సీనియర్ నేత పులి సత్యనారాయణ రెడ్డి



**కలికిరి మన జనప్రగతి జూన్ 26 :-** ఆపదలోని పేదలకు ఆపన్నహస్తం అందించి మేమున్నామనే భరోసా కల్పించే ఆపద్బాంధవులు నల్లారి బ్రదర్స్ అని టీడీపీ సీనియర్ నేత పులి సత్యనారాయణ రెడ్డి కొనియాడారు. వాల్మీకిపురం మండలం గండబోయినపల్లికి చెందిన షేక్ అమీర్ భాష (32) నాలుగు నెలల క్రితం ద్విచక్ర వాహనం లో వెళ్తూ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. ఆసుపత్రిలో చికిత్స పొంది ఇటీవల ఇంటిదగ్గర విశ్రాంతి తీసుకుంటున్న అతను సీఎం రిలీఫ్ ఫండ్ కు దరఖాస్తు చేసుకున్నారు. మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి ల సిఫారసు మేరకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆర్థిక సహాయం మంజూరైంది. శుక్రవారం కలికిరి మండలం నగిరిపల్లి లోని ఎమ్మెల్యే నివాసంలో నాయకులు పులి సత్యనారాయణ రెడ్డి అమర్నాథ్ రెడ్డి శేషాద్రి రెడ్డి ల ఆధ్వర్యంలో అమీర్ భాషకు ఎమ్మెల్యే సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో గండబోయినపల్లికి చెందిన లడ్డు, మహమ్మద్ ముబారక్, గండబోయినపల్లి యూత్ పాల్గొన్నారు.

మన జనప్రగతి
తెలుగు దినపత్రిక
27 - 06 - 2026

# ఈ కొత్తపల్లిలో ముగిసిన మొహరం వేడుకలు

**● వేలాది భక్తులు మధ్య కోలాహలంగా జలధి కార్యక్రమం ● ఐకమత్యానికి ప్రతీకగా మొహరం ఉత్సవాలు**







**పులివెందుల, మన జనప్రగతి, జూన్ 24 :-** పులివెందుల మండల పరిధిలోని ఈ కొత్తపల్లి గ్రామంలో మొహరం ఉత్సవాలు ఘనంగా మూసాయి. 7 రోజులుగా కొనసాగుతున్న ఈ వేడుకలు గ్రామంలో భక్తి, సంప్రదాయాలు, తో ఈ మొహరం పండుగ నిర్వహించుకోవడం జరిగిందిఉత్సవాల్లో భాగంగా శుక్రవారం సాయంత్రం గ్రామానికి చెందిన హస్తం , పిల్లల పీర్లను బైక్ తీసుకువెళ్లడం జరిగిందిగురువారం రాత్రి సంప్రదాయబద్ధంగా అగ్నిగుండం కార్యక్రమం నిర్వహించారు కూడా పెద్ద ఎత్తున హాజరవడం జరిగింది శుక్రవారం సాయంత్రం నుంచి పీర్ల సావిడి వద్దకు పెద్ద ఎత్తున ప్రజలు హాజరయ్యారు చిత్ర విచిత్ర వేషాలతో డంపు వాయిద్యాల మధ్య సంగీతాలతో నృత్యాలను ప్రదర్శించడం జరిగింది ముఖ్యంగా గ్రామీణంగా ప్రాంతాలు నిర్వహించే పోటేషన్ వేయడం జరిగింది అదేవిధంగా అదేవిధంగా ప్రతి ఏడాది సంతానం కోసం మొక్కుకున్న వారికి తిరిగి మరల మొహరం వచ్చేసరికి సంతానం కలిగిన వారు తమ పిల్లలను అగ్నిగుండంలో పండు వేయడం జరిగింది ఆ చిన్నారులం అగ్నిగుణంలో పండేసిన సమయంలో ఎలాంటి గాయాలు కాకపోవడంతో స్వామివారి సత్యం ఉందని ఇక్కడ ప్రజలు దృఢమైన నమ్మకం అంతేకాకుండా ఇక్కడ ఏదైనా కోరిక కోరుకుంటే తిరిగి మరల మొహరం వచ్చే సమయానికి తప్పకుండా నెరవేరుతాయి అని మంచి విశ్వాసం ముఖ్యంగా ఈ కొత్తపల్లి గ్రామంలో అన్ని వర్గాల ప్రజలు కుల, మత భేదాలకు అతీతంగా ఐకమత్యంతో మొహరం వేడుకలను నిర్వహించడం విశేషం. అలాగే విద్య, ఉద్యోగ, వ్యాపార రీత్యా ఇతర ప్రాంతాలు, విదేశాల్లో స్థిరపడిన గ్రామస్తులు సైతం ప్రతి ఏడాది మొహరం ఉత్సవాలకు హాజరై తమ గ్రామ సంప్రదాయాల పట్ల ఉన్న అనుబంధాన్ని చాటుకుంటున్నారు.గ్రామంలో భక్తి, సంప్రదాయం, సామరస్య వాతావరణంలో జరుగుతున్న మొహరం వేడుకలు స్థానికులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.ఇక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా ముందస్తుగా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగింది మోహరం రోజు చివరి రోజు కావడంతో అర్బన్ సీఐ శ్రీరామ్ తన సిబ్బందితో వచ్చి ఇక్కడ పర్యవేక్షించడం జరిగింది ఈ కొత్తపల్లి గ్రామ ప్రజలు అర్బన్ సీఐను సన్మానించడం జరిగింది గ్రామ ప్రజలు ప్రశాంతంగా ఎలాంటి ఘర్షణ వాతావరణం నిర్వహించు కోకుండా పండగ నిర్వహించుకోవడం ఎంతో సంతోషకరమని ఇలాగే ఉండాలని సీఐ శ్రీరామ్ గ్రామ ప్రజలను అభినందించారు

# వేంపల్లెలో ఘనంగా ముగిసిన పీర్ల పండుగ మహోత్సవాలు





**వేంపల్లె మన జనప్రగతి జూన్ 26:-**వేంపల్లె మండల పరిధి లోని చింతలమడుగు పల్లె గ్రామంలో ఇమామ్ ఖాశీమ్ స్వామివారి పీర్ల పండుగ మహోత్సవాలు ఘనంగా 19వ తేదీకి నుండి ఘనంగా కొనసాగి నేడు గ్రామోత్సవంతో ఘనంగా ముగిశాయని సభ్యులు, గ్రామస్తులు తెలిపారు.ఈ సందర్భంగా గురువారం రాత్రి పెద్ద సరిగెత్తు పూజలు నిర్వహించారు.అర్ధరాత్రి భక్తులు అగ్నిగుండ ప్రవేశం చేశారని తెలిపారు.అలాగే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.అనంతరం మద్యాహ్నం 3గంటలకు మంగళ వాయిద్యాలు,కనక తప్పెట్లు,బాణసంచాల నడుమ అంగరంగ వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు. 19వ తేది శుక్రవారం స్వామివారి తొలిపూజ, 23వతేది చిన్న సరిగెత్తు, 24వతేది విడిదినం,25వతేది పెద్ద సరిగెత్తు పూజలు నిర్వహించామన్నారు. 5రోజుల పాటు పీర్ల పండుగ మహోత్సవాలు నిర్వహించామని నిర్వాహకులు తెలిపారు.

# అందరికీ అందుబాటులోకి ఏసర్ ఎక్స్‌క్లూజివ్ షోరూమ్




**కడప మన జనప్రగతి జూన్ 26:-**కడప నగరంలోని బస్టాండ్ సమీపంలో, సౌత్ ఇండియా షాపింగ్ మాల్ ఎదురుగా నూతనంగా ఏర్పాటు చేసిన ఏసర్ (ఏ సి ఈ ఆర్) ఎక్స్‌క్లూజివ్ షోరూమ్ ఘనంగా ప్రారంభమైంది. ఈ షోరూమ్‌లో అత్యాధునిక సాంకేతికతతో కూడిన ఏసర్ ల్యాప్‌టాప్‌లు, కంప్యూటర్లు, ప్రింటర్లు, కలర్ ప్రింటర్లు, ఇంటరాక్టివ్ ప్యానెల్స్, టీవీలు, ఏసీలు తదితర ఎలక్ట్రానిక్ ఉత్పత్తులు వినియోగదారులకు అందుబాటులో ఉంటాయని సంస్థ యజమాని గునిశెట్టి సాయికుమార్ తెలిపారు.ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి నగరానికి చెందిన పలువురు ప్రముఖులు హాజరై షోరూమ్‌ను ప్రారంభించి నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. ముఖ్య అతిథులుగా కందుల గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ చైర్మన్ కందుల చంద్ర ఓబుల్ రెడ్డి (నాని), మానవతా రామచంద్ర రెడ్డి, పద్మశాలి సంఘం అధ్యక్షుడు వెంకటసుబ్బయ్య, బీసీ సంఘం సీనియర్ నాయకుడు అవ్వారు మల్లికార్జున, మాజీ మేయర్ పాకా సురేష్, మానస చిన్నపరెడ్డి తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ప్రముఖులు సాయికుమార్‌ను శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలు అందించి ఘనంగా సత్కరించారు. సేవా దృక్పథంతో ముందుకు సాగే సాయికుమార్ వ్యాపార రంగంలో మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమానికి హాజరై తనను ఆశీర్వదించి ప్రోత్సహించిన ప్రతి ఒక్కరికీ సాయికుమార్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

# వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ జీవీఆర్ కరాటే అకాడమి




**హైదరాబాద్ మన జనప్రగతి జూన్ 26:-** అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ఇంటర్నేషనల్ పర్యవేక్షణలో శుక్రవారం కాచిగూడ లోని జీవీఆర్ కరాటే అకాడమీ లో నిర్వహించిన కార్యక్రమంలో కరాటే విద్యార్థులు అద్భుతమైన ప్రదర్శన కనబరిచి వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సాధించారు. కరాటే మాస్టర్ డాక్టర్ జిఎస్ గోపాల్ రెడ్డి కరాటే విద్యార్థులైన భార్గవసాయి, ప్రణీత్, నైతిక్ రెడ్డి, సంజన, తన్వి, చిన్మయి ప్రియాలతో కలిసి ఈ రికార్డు చేశారు. 36 సెకండ్లలో 6 మంది విద్యార్థుల తలలపై ఉంచిన 26 యాపిల్స్ను చేతితో బ్రేక్ చేసి రికార్డు సృష్టించారు. వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ఇంటర్నేషనల్ ఇండియా చీఫ్ కో-ఆర్డినేటర్ బింగి నరేందర్ గౌడ్ రికార్డు చేసిన గోపాల్ రెడ్డి తో పాటు విద్యార్థులకు సర్టిఫికెట్స్, మెడల్స్ ను అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు మహాలక్ష్మి రామన్ గౌడ్, కన్నె ఉమా రమేష్ యాదవ్, డాక్టర్ ఎ.కృష్ణారెడ్డి, కోట్ల నిరంజన్ రెడ్డి, కరీమ్, అమృతరెడ్డి, గణ సంతోషిణి రెడ్డి, రాజు, సుధాకర్, అనఘ, షైనీ, ద్వైత తదితరులు పాల్గొని రికార్డు గ్రహీతలు అభినందించి సత్కరించారు. జివిఆర్ కరాటే అకాడమీ వ్యవస్థాపకులు, డైరెక్టర్ డాక్టర్ జి.ఎస్. గోపాల్ రెడ్డి తన అసాధారణ కరాటే నైపుణ్యాన్ని ప్రదర్శిస్తూ.. ఆరుగురు విద్యార్థుల తలపై ఉంచిన 26 ఆపిల్స్‌ను కేవలం 36 సెకన్లలో హ్యాండ్ చాప్స్ ద్వారా బ్రేక్ చేసి సరికొత్త ప్రపంచ రికార్డును నెలకొల్పారు. ఈ సందర్భంగా వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ఇంటర్నేషనల్ ఇండియా చీఫ్ కో-ఆర్డినేటర్ శ్రీ బింగి నరేందర్ గౌడ్ మాట్లాడుతూ.. అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా సమాజానికి చైతన్యాన్ని కలిగించే సందేశంతో ఈ ప్రపంచ రికార్డును నిర్వహించడం అభినందనీయమని అన్నారు. కేవలం 36 సెకన్లలో అత్యంత క్రమశిక్షణ, ఏకాగ్రత, భద్రతా ప్రమాణాలతో ఈ విన్యాసాన్ని విజయవంతంగా పూర్తి చేసిన డాక్టర్ జి.ఎస్. గోపాల్ రెడ్డిని అభినందించారు. ప్రపంచ రికార్డులు కేవలం ప్రతిభను ప్రదర్శించడానికి మాత్రమే కాకుండా సమాజానికి ఉపయోగపడే సందేశాన్ని అందించేలా ఉండాలని, ఆ దిశగా డాక్టర్ గోపాల్ రెడ్డి ఎన్నో సంవత్సరాలుగా కృషి చేస్తున్నారని కొనియాడారు. అలాగే ఈ రికార్డులో పాల్గొన్న భార్గవ సాయి, ప్రణీత్, నైతిక్ రెడ్డి, సంజన, తన్వి, చిన్మయి ప్రియ లను ప్రత్యేకంగా అభినందిస్తూ, వారి ధైర్యం, విశ్వాసం, క్రమశిక్షణ ఈ ప్రపంచ రికార్డు విజయానికి ప్రధాన కారణమని పేర్కొన్నారు. డాక్టర్ జి.ఎస్. గోపాల్ రెడ్డి, పాల్గొన్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు మరియు జివిఆర్ కరాటే అకాడమీ బృందానికి వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ఇంటర్నేషనల్ తరఫున శుభాకాంక్షలు తెలియజేస్తూ, భవిష్యత్తులో మరిన్ని ప్రపంచ రికార్డులు సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా మాజీ హిమాయత్‌నగర్ కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్, మాజీ కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్, వివేక్ హాస్పిటల్ వ్యవస్థాపకులు డాక్టర్ ఎ. కృష్ణా రెడ్డి, నేతాజీ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ వ్యవస్థాపకులు మరియు డైరెక్టర్ కోట్ల నిరంజన్ రెడ్డి, జివిఆర్ కరాటే అకాడమీ బ్లాక్ బెల్ట్స్ కరీమ్, అమృత రెడ్డి, గణ సంతోషిణి రెడ్డి, రాజు, సుధాకర్, అనఘ, షైనీ, ద్వైతతో పాటు అకాడమీ విద్యార్థులు, తల్లిదండ్రులు, క్రీడాభిమానులు మరియు పలువురు ప్రముఖులు పాల్గొని డాక్టర్ జి.ఎస్. గోపాల్ రెడ్డి మరియు విద్యార్థులను అభినందించారు. ఈ ప్రపంచ రికార్డు ద్వారా యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి క్రీడలు, క్రమశిక్షణ, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని జివిఆర్ కరాటే అకాడమీ పిలుపునిచ్చింది.

# నెల్లూరులో వైభవంగా ప్రారంభమైన రొట్టెల పండుగ



**నెల్లూరు మన జనప్రగతి జూన్ 26:-** బారా షహీద్ దర్గా వద్ద నిర్వహిస్తున్న రొట్టెల పండుగ శుక్రవారం వైభవంగా ప్రారంభమైంది. రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ, ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఎస్పీ అజితా వేజెండ్ల తదితరులు ఏర్పాట్లను పరిశీలించి స్వర్ణాల చెరువులో బోట్ షికార్ నిర్వహించారు.మంత్రి నారాయణ మాట్లాడుతూ, 2014-19లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రొట్టెల పండుగకు రాష్ట్ర పండుగగా గుర్తింపు ఇచ్చారని తెలిపారు. కూటమి ప్రభుత్వం బారా షహీద్ దర్గా ప్రాంతాన్ని టూరిజం హబ్‌గా అభివృద్ధి చేస్తోందన్నారు. ఈ ఏడాది సుమారు 15 లక్షల మంది భక్తులు వచ్చే అవకాశం ఉందని చెప్పారు.భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా 6,315 మంది మున్సిపల్ సిబ్బంది, 1,870 మంది పోలీసులతో పాటు డ్రోన్లు, సీసీ కెమెరాల ద్వారా పటిష్ట భద్రత ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఉచిత వైద్య శిబిరాలు, బోట్ షికార్, పరిశుభ్రతపై ప్రత్యేక చర్యలు చేపట్టామని పేర్కొన్నారు.ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ, గత 50 ఏళ్లుగా రొట్టెల పండుగకు వస్తున్నానని, దర్గా అభివృద్ధితో ఇది ప్రముఖ పర్యాటక కేంద్రంగా మారిందని అన్నారు. వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ, రొట్టెల పండుగ మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తోందని తెలిపారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# నిందితులకు కాపు కాస్తున్నది ఎవరు

**ముఖ్యమంత్రి దత్తత తీసుకున్న గ్రామానికే దిక్కు లేదా ..?**

**ఈదుమూడి యాదవ గొర్రెలు కాపరులు పై జరిగిన అమానుష దాడి ఘటనను ముక్త కంఠం తో ఖండించిన ప్రజా సంఘాలు**



**ఒంగోలు మన జనప్రగతి జూన్ 26:-** ఈదుమూడి గ్రామంలో జూన్ 7న యాదవ కులానికి చెందినటు వంటి గొర్రెల కాపరులైన వడ్లమూడి మధు, యల్లావుల అనిల్ పై జరిగిన భౌతిక దాడి మరియు కులం పేరు తో బూతులు తిట్టి కించపరుస్తూ అవహేళనగా మాట్లాడటం, మహిళలను ఉద్దేశించి అసభ్యకరంగా పచ్చి బూతులు తిట్టిన ఉప్పల సుబ్బారావు మరియు ఉప్పల వెంకటేశ్వర్లు తదితరులపై నాగులుప్పలపాడు పోలీస్ స్టేషన్ నమోదైన 57/2026 కేసులో వెంటనే ముద్దాయిలను అరెస్టు చేయాలని, ముద్దాయిలు పెట్టిన కౌంటర్ కేసు 58/2026 ను రద్దు చేయాలని ప్రజాసంఘాలు ముక్తకంఠం తో డిమాండ్ చేశాయి. సంఘటన జరిగి మూడు వారాలు గడుస్తున్నప్పటికినీ ప్రభుత్వం పట్టించుకోక పోవడం శోచనీయం అని, బాధితుల గ్రామం ఆవుల దొడ్డి గొల్లపాలెం పి4 కింద ముఖ్యమంత్రి చంద్రబాబు దత్తత తీసుకున్న గ్రామంలోనే ఈ పరిస్థితులు ఉంటే మిగతా చోట్ల పరిస్థితులు ఎలా ఉంటున్నాయోనని ఆందోళన వ్యక్తం చేశారు. ఈదుమూడి లో గొర్రెలు కాపరులపై జరిగిన అమానుష ఘటనలో నిందితుల కొమ్ము కాస్తున్నది ఎవరని,నిందితులను కాపాడుతున్నసూత్రదారులు ఎవరు అని,అధికారుల కాలయాపన లో మతలబు ఏమిటి అని వక్తలు ప్రశ్నించారు.ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో సమస్య పరిష్కార సాధన కు నిర్ణయాలు, భవిష్యత్ ప్రణాళిక రూపకల్పన గురించి చర్చించారు. అఖిలపక్ష ప్రజా సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం శుక్రవారం హైదరీ క్లబ్ కాన్ఫరెన్స్ హాల్ లో జరిగింది.అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర శతాబ్ది ఉత్సవ అధ్యక్షుడు బొట్లా రామారావు అధ్యక్షతన జరిగిన జరిగిన ఈ సమావేశంలో జాతీయ ఎరుకుల హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు ధర్మా, రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు దాసరి చెన్నకేశవులు, బీఎస్పీ రాష్ట్ర నాయకులు తాటిపర్తి వెంకటస్వామి, సమాజ్ వాది పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పాశం వెంకటేశ్వర్లు, ద్రవిడ దేశం పార్టీ అధ్యక్షులు కృష్ణారావు, అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దొడ్డక ఆంజనేయమూర్తి, జిల్లా అధ్యక్షులు బొట్ల సుబ్బారావు, అఖిల భారత యాదవ మహాసభ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు నాగమల్లేశ్వరి, అఖిల భారత యాదవ మహాసభ బాపట్ల జిల్లా అధ్యక్షులు తాడిబోయిన లక్ష్మీప్రసాద్, బీఎస్పీ జిల్లా అధ్యక్షులు షేక్ అజీజ్, బీసీ నాయకులు గవిని శ్రీను, గుళ్లాపల్లి వీరభద్రాచారి, పులి హరి కృష్ణ , ఆతిన వెంకటరావు,వడ్లమూడి భాస్కరరావు, జడ బాల నాగేంద్ర, బంకా చిరంజీవి, మసిముక్కు భాస్కర్ బాధితులు వడ్లమూడి మధు, ఎల్లావుల అనిల్, గొర్ల పెంపకం దారుల సంఘం నాయకులు కిలారు పెద్దబ్బాయి తిరుపతిరావు బుర్రి ఆంజనేయులు, ఫణిదపు సుధాకర్, తదితరులు పాల్గొన్నారు

# రాష్ట్ర అలైడ్ అండ్ హెల్త్ కేర్ ప్రొఫెషన్ కౌన్సిల్ సభ్యుడిగా డా.జి రెడ్డెన్న నియామకం



**రాయచోటి మన జనప్రగతి జూన్ 26:-**రాయచోటి పట్టణానికి చెందిన ప్రముఖ కంటి వైద్య నిపుణులు డా. జి. రెడ్డెన్నను ఆంధ్రప్రదేశ్ స్టేట్ అలైడ్ అండ్ హెల్త్ కేర్ ప్రొఫెషన్ కౌన్సిల్ (ఏ.పీ.ఎస్.ఏ.హెచ్.పి.సి) రాష్ట్ర సభ్యుడిగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ జనరల్ అడ్మినిస్ట్రేషన్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్ కుమార్ ఉత్తర్వులు జారీ చేసినట్లు డా. రెడ్డెన్న తెలిపారు. ఆయన మూడేళ్లపాటు కౌన్సిల్ సభ్యుడిగా కొనసాగనున్నారు.డా. రెడ్డెన్న గత 40 సంవత్సరాలుగా కంటి వైద్య రంగంలో విశిష్ట సేవలు అందిస్తున్నారు. ప్రస్తుతం సురభి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆఫ్తాల్మిక్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో జిల్లాలోని వందలాది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి, వేలాది మందికి వైద్య సేవలు అందించారు.అంతేకాకుండా రోటరీ క్లబ్ అధ్యక్షుడిగా, అసిస్టెంట్ గవర్నర్‌గా సేవలందిస్తూ అనేక ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహించి ప్రజలకు విశేష సేవలు అందించారు.డా.జి.రెడ్డెన్న రాష్ట్ర అలైడ్ అండ్ హెల్త్ కేర్ ప్రొఫెషన్ కౌన్సిల్ సభ్యుడిగా నియమితులవడం పట్ల రాయచోటికి చెందిన ప్రభుత్వ, ప్రైవేటు వైద్యులు, ప్రజాప్రతినిధులు, వివిధ రంగాల ప్రముఖులు హర్షం వ్యక్తం చేసి ఆయనకు అభినందనలు తెలిపారు.

PRINTER, PUBLISHER AND OWNED BY **YADATI VIVEKANANDA REDDY YADAV**, AND PRINTED AT M/S GOKUL PUBLICATIONS, # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), PUBLISHED AT # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), Editor : YADATI VIVEKANANDA REDDY YADAV, E-Mail :manajanapragathi@gmail.com, Cell : 8125555507 RNI No : - APTEL/2021/80174